ప్రజాశక్తి

Vol. 3, no. 24

(Dec. 15, 1943)

బెజవాడ, 1943

Record no. 683

Prajāśakti

Vol. 3, no. 24

(Dec. 15, 1943)

Bejavāḍa, 1943

Record no. 683

0-2-0 Regd. No M. 4486


ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 3 | సంచిక 24

: సంపాదకవర్గం :
మద్దుకూరి చంద్రశేఖరరావు (సం)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
తమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు

బుధవారం 15-12-43



మన రాష్ట్రం సరిహద్దులను కాపాడుతూన్న సింధియా (విశాఖపట్నం హార్బరు) కార్మిక వీరుల ఊరేగింపు.

తిండిదొంగల నెదుర్కొనుటకు

అహమదాబాద్ ప్రజల స్వయంకృషి

—///—

కలకత్తా అనుభవిస్తూన్న నరకయాతనలు అహమదాబాదు మహానగరానికి కూడా పట్టవలసిందేకాని, కొద్దిలో తప్పిపోయింది. ఈనాటికికూడా ప్రమాదం పూర్తిగా తొలగిపోలేదు. తిండిదొంగలపని పట్టడం పూర్తికాలేదు.

జనవరి మొదటితేదీనుంచి రేషనింగు అమలు జరుపుతామని ప్రభుత్వం ప్రకటించింది. దాంతో తిండిదొంగలు సర్దుకోవడం ప్రారంభించారు. అంతవరకు ధరలు క్రమ క్రమంగా పెరుగుతూన్నా - బియ్యం కొద్దో గొప్పో అంగడిలో దొరికేవి. ప్రభుత్వ ప్రకటన రావడంతో బియ్యం మటుమాయమయిపోయింది. ఎక్కడికి మాయమయిందో అహమదాబాద్‌లో అందరికీ తెలుసు. విదేశాలకూ కాదు - సైన్యానికీకాదు ;

బియ్యంలో ముప్పాతిక పాళ్లు దొంగ మార్కెట్టులోకి పోయిందని పుర ప్రముఖుల్లో ఒకరన్నారు. హోటళ్ళలో చపాతీధర రెట్టింపయింది. ఇక బీదవారిసంగతి చెప్పనక్కరలేదు.

తిండిదొంగల ఎత్తుకు ఎదురెత్తు వేయదలచింది ప్రభుత్వం. దొంగమార్కెట్లలో బియ్యం ఎవరూ అమ్మకూడదని ప్రభుత్వం నిషేధించింది. దీనిఫలితం ? రెండురోజులు అంగళ్లలో ఒక్క బియ్యం గింజయినా దొరకలేదు. నానా తంటాలు పడి, బోలెడంత సొమ్మివ్వడానికి సిద్ధపడితే, ఏఅర్ధరాత్రప్పుడో ఏ మారుమూలనో కొన్నిగింజలు దొరికేవి.

పెట్టి, ఈ తిండిదొంగల ఆటలను అరికట్టాలని ఆబాలగోపాలం ఆందోళన సాగించింది. జిల్లా కమ్యూనిస్టుపార్టీకార్యదర్శి మేజిస్ట్రేటును కలుసుకొని, ఈ విషయం చర్చించారు.

ఈ ఆందోళనంతా చూచి సప్లయి కమీషనరు బొంబాయినుంచి అహమదాబాద్ పరుగెత్తుకువచ్చారు. ధాన్యండిపోల సంఖ్య 49 కి పెరిగింది. జనవరి మొదటితేదీకి అమలు జరుపుతామన్న రేషనింగును డిసెంబరు 19 నే ప్రారంభించడానికి నిర్ణయించారు. ధాన్యంతో నిండిన రెండురైళ్లు అహమదాబాదు చేరాయి.

కోఆపరేటివ్ సొసైటీలు


బాధ్యతనంతా అధికారులకే అప్పగించి ప్రజలు చేతులు ముడుచుకు కూర్చోలేదు. స్వయంసహాయాన్ని మించిన సహాయం లేదనిగ్రహించారు. అహమదాబాద్ అంతటా కోఆపరేటివ్ సొసైటీలు స్థాపించడం ప్రారంభించారు. నెల పదిహేను రోజుల్లో 135 సొసైటీలు ఏర్పడ్డాయి. నగరంలోని 7 లక్షల జనాభాలో సగంమంది అవసరాలను తీర్చగల శక్తి వీటికి కలిగింది. అంతేకాదు, ప్రభుత్వం స్థాపించిన ధాన్యం డిపోలపై అజమాయిషీ కూడా ఈ సొసైటీలకే సంక్రమిస్తూంది. బొగ్గు సరఫరా అంతా అప్పుడే వీటి చేతికిందికి వచ్చింది.

ఈ బొగ్గు సమస్య కూడా ఆహారసమస్య అంత తీవ్రమయింది. బియ్యం వర్తకుల్లాగానే బొగ్గు వర్తకులుకూడా ధరలు విపరీ

ప్రజలు నిజం తెలుసుకున్నారు

ప్రజలు యింకా నలిగి, నానాబాధలు పడసాగారు. వర్తకుల అమానుషత్వాన్ని ప్రజలు గ్రహించ గలిగారు. అంతకొకవారం రోజులముందే తిండి దొంగలంటూ ఎవరూ లేరని అనుకొంటుండేవారు. బియ్యం స్టాకు ఎక్కువగా లేకపోవడం వల్లనే ధరపెరిగిందని పొరబడ్డారు. ఇప్పుడు నిజం గ్రహించారు.

బియ్యం దాచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ



19 వ ఆంధ్రరాష్ట్ర విద్యార్థి మహాసభ ఊరేగింపు

స్థానిక కాంగ్రెసునాయకులు ఒక ప్రకటన చేశారు. తమకు సరిపడేదానికన్నా ఎక్కువ ధాన్యం ఉంటే దానిని అంగడిలో పెట్టాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. తిండిదొంగలను పట్టుకొని దుమ్ముదులగొట్టాయి స్థానికపత్రికలన్నీ. ప్రభుత్వమే ఇంకా ఎక్కువ ధాన్యం డిపోలు

తంగా పెంచారు. కంట్రోలు రేటు మణుగు రూ 2 . కాని దొంగమార్కెట్టు రేటు 5 రూపాయలు. కట్టెల ధర మునుపటికన్నా రెండింతలయింది. చివరకి పరిస్థితు లెలా తయారయాయంటే - చచ్చి చెడి బియ్యం సంపాదించినా వంట చెరుకు కరువయి వండుకోలేక పస్తు

లుండ వలసివచ్చింది. బొగ్గు వర్తకుల ప్రవర్తనను ప్రజలు సహించలేకపోయారు. నాల్గు మూలలనుంచి ఖండించసాగారు. మాండ్విపోల్‌లో లూటింగు జరిగింది. నారోడైన్‌కార్మిక పేటలో ప్రజలు ఒక కొట్టుముందు పోగయి,కంట్రోలురేటుకు బొగ్గును అమ్మేలాచేశారు.

ఆహార సలహా సంఘంలో కమ్యూనిస్టు ప్రతినిధి వర్తకుల ప్రవర్తనను తీవ్రంగా ఖండించారు, అందరూ ఆతనిని బలపరిచారు. బొగ్గు వర్తకుల లైసెన్సులను రద్దుచేసి, బొగ్గు సరఫరా అంతా కోఆపరేటివ్ సొసైటీలకు వప్పగించాలని నిర్ణయించారు. దానితో బొగ్గు పరిస్థితి చక్కబడింది.

ఇంత జరిగినా—

ఇన్ని విజయాలు సాధించినా అహమదాబాద్‌లో పరిస్థితులింకా తీవ్రంగానే ఉన్నాయి. తిండిదొంగను రూపుమాపడానికేలాంటి ఉద్యమం ప్రారంభంకాలేదు. రేషనింగును పాడుచేయడానికి తిండిదొంగలు కుటలు పన్నుతూనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో అహమదాబాదులోని రాజకీయ పార్టీలేమి చేస్తున్నాయి ?

అహమదాబాదులో కాంగ్రెసు మాటకు ఎదురులేదు. కాంగ్రెసు నాయకులు యితర పార్టీల సహకారం తీసుకోవడానికి ముందుకు వచ్చారంటే అందరూ కలిసివస్తారు. కాని వారు ముందుకు రావటంలేదు. బెంగాలు నేర్పుతూన్న పాఠాన్ని వీరింకా గ్రహించలేదు. మామూలు పరిస్థితుల్లో లాగానే అన్నిటినీ తమంతట తామే చక్కబెట్టుకోగల మనుకొంటున్నారు. ఇతర పార్టీలవారి నెవ్వరినీ చేర్చుకోకుండా, తమ ప్రతినిధులతోనే ఒక కేంద్రకమిటీని ఏర్పాటుచేశారు. అన్ని పార్టీలను కలిపి కమిటీ నేర్పాటుచేద్దామని కమ్యూనిస్టులు చేసిన సూచనను నిరాకరించారు.

మహిళలు మార్గంచూపారు

వీరివైఖరి ఇలా వుంటూంటే, మహిళా సంఘంవారు చక్కని ఆదర్శం చూపారు. కాంగ్రెసు, ముస్లిం, కమ్యూనిస్టు అనే భేదం లేకుండా అందరినీ చేర్చుకొని ఒక సేవా సమితిని ఏర్పాటుచేశారు, ధాన్యం డిపోల దగ్గర ఈ సమితి అప్పుడే పని ప్రారంభించింది.

అహమదాబాదులో అన్ని పార్టీలను ఐక్యపరచడానికి కమ్యూనిస్టు పార్టీ కంకణం కట్టింది. బెంగాలు నేర్పుతూన్న పాఠాన్ని నేర్చుకొండని దేశభక్తు లందరికీ విజ్ఞప్తి చేస్తూంది. రేషనింగు జయప్రదం కావాలంటే, తిండిదొంగల ఆటలను అరికట్టాలంటే, అందరూ ఏకమై పనిచేయాలని హెచ్చరిస్తుంది.

అహమదాబాదులోని బెంగాలు సహాయ సంఘం తరపున కలకత్తా వెళ్ళివచ్చిన ప్రతినిధులు ఈ విషయాన్నే నొక్కిచెప్పారు,

"ప్రజల ఆహార సమస్యను పరిష్కరించాలంటే ఐక్య ఆహార కమిటీని వెంటనే ఏర్పాటు చేసుకోవాలని బెంగాల్ గుణపాఠం నేర్పుతూంది " అని అన్నారు.

ఐక్యతే స్వాతంత్ర్యానికి మార్గం

విశాఖజిల్లా కాంగ్రెసునాయకుని విజ్ఞప్తి

శ్రీ మంత్రిప్రగడ వెంకటరమణమూర్తిగారు విజయనగర పట్టణ కాంగ్రెసు కమిటీ కార్యదర్శి; విశాఖ జిల్లా కాంగ్రెసు కమిటీ కార్యనిర్వాహకవర్గసభ్యులు. 1930 నుండి కాంగ్రెసు ఉద్యమంలో పాల్గొంటున్న దేశభక్తులు. ఈనాడు కాంగ్రెసుబురఖాతో కొందరు సాగిస్తూన్న కార్యక్రమం కాంగ్రెసు పవిత్ర సాంప్రదాయాలకే ఎలా కళంకం తెస్తున్నాయో గ్రహించారు. ఈ కార్యక్రమాన్ని ఖండిస్తూ, దేశభక్తులందరూ ఏకమై దేశరక్షణకు సాగిరమ్మని ఈ దిగువప్రకటన చేస్తున్నారు.

"మొదట్లో నాకు కమ్యూనిస్టు పార్టీ అంటే చాల వెగటుగా యుండేది. 1939 లో వ్యక్తి సత్యాగ్రహ సందర్భంలో నేను జైలు కెళ్ళినపుడు కమ్యూనిస్టుపార్టీ సభ్యులు; కాలశివయ్య, రామమోహన్, జగన్మోహన్ గార్లతో పరిచయం కలిగింది — కమ్యూనిస్టులతో అనేకసార్లు చర్చలుచేసేను — తద్వారా పార్టీకి నిజమయిన కార్యక్రమం ఉందని గ్రహించగలిగాను.

"గత అగస్టులో మొదట్లో కించత్ చలించినప్పటికీ విమ్మట విధ్వంసక చర్యలు పంచమాంగ దళంవారి ప్రోత్సాహమనియూ, కాంగ్రెసు కార్యక్రమము కాదనియూ, అది దేశక్షేమానికి తోడ్పడదనియూ అర్ధం చేసుకున్నాను.

"నేడు జాతీయ అంతర్జాతీయ పరిస్థితుల్ని సమన్వయంచేసి, భారత దేశ రక్షణ, స్వాతంత్ర్యానికి, క్షామనివారణకీ, కమ్యూనిస్టుపార్టీ యిచ్చిన కార్యక్రమం అభ్యుదయకరమైనదని నా అభిప్రాయం. ఇదే దేశ క్షేమానికి చుక్కానియని నా నమ్మకం.

"దేశనాయకుల విడుదలకు, భారతదేశ రక్షణకు, యీ ఘోర క్షామాన్నిదాటి దేశాన్ని సుభిక్షంగా చేసుకోవడానికి మన వివిధ రాజకీయపక్షాల ఐక్యతయే మహాసాధనం — ఐక్యతయే స్వాతంత్ర్య సంపాదనకు మహా ఆయుధం. అనాలోచితమైన ఉద్రేకాన్ని, సంకుచితమైన విభేద భావాలను, మన దేశభక్తులందరమూ విడచి ఏకంకాకపోతే, యీ చావు బ్రతుకుల సంక్షోభంలో మన దేశం, మన ప్రజలు, జపాను ఫాసిస్టులకో, బ్రిటిషు సామ్రాజ్యవాదులకో, శాశ్వతంగా బానిసలైపోక తప్పదు. కాబట్టి దేశభక్తు లందరము, ముఖ్యంగా సోదర కాంగ్రెసువాదులు, దేశక్షేమాని కనుగుణ్యంగాయున్న యీకార్యక్రమమును అనుసరించవలసిందని ప్రార్థిస్తున్నాను."

బుధవారం ప్రజాశక్తి 15-12-43

గుంటూరు జిల్లా మేజిస్ట్రేటు ఉత్తరువు

గుంటూరు జిల్లా మేజిస్ట్రేటు ఇండియా డిఫెన్సుచట్టం 56 వ రూల్ క్రింద గుంటూరుజిల్లాలో ఏ రాజకీయపార్టీగాని, సానుభూతిపరులుగాని, ఊరేగింపులు తీసుకు రాదని నిషేధించుతూ ఉత్తరువు జారీచేసాడు. శాంతి భద్రతలను కాపాడటానికి యీ ఆర్డరు అవుసరమయిందని తెలియజేసాడు. ఈ ఉత్తరును ఉల్లంఘించేవారికి ఇండియా రక్షణచట్టంక్రింద 3 సంవత్సరాలవరకు శిక్ష, లేక జరిమానా, లేక రెండూ, విధించబడుతాయని ప్రకటించాడు.

ఈ ఆర్డరు ఎందుకు యివ్వవలసి వచ్చింది? నిజంగా దేశరక్షణకు యిది తోడ్పడుతుందా? అనే ప్రశ్నలు మనను ఎదుర్కొంటాయి. ఏ రాజకీయ పార్టీ ఊరేగింపులు వగైరా చేయరాదనడం ప్రజల పౌరసత్వహక్కులకే విరుద్ధం. అంతేగాక ప్రజలలో ఫాసిస్టు వ్యతిరేక రాజకీయ చైతన్యం కలిగించాలంటేను, వారిని యుద్ధకృషికి సమీకరించాలంటేనూ, గుంటూరుజిల్లా మేజిస్ట్రేటు ఉత్తరువు ఆటంకమవుతుంది. జపాన్ దుండగీడులను ఎదిరించాలనీ, మాతృదేశరక్షణ చేసుకోవాలనీ కృషిచేసే రాజకీయపార్టీల చేతులకుకూడ యిది సంకెల అవుతుంది. అలాంటి రాజకీయపార్టీలు ప్రజలలో ప్రబోధంచేసి, రాజకీయ చైతన్యం కలుగజేస్తేగాని, ప్రజలను జపానుకు వ్యతిరేకంగా సమీకరించడం సాధ్యపడదు: యుద్ధకృషికి ప్రజాసహకారం సంపాదించలేము. అందుచే ఈ ఆర్డరు దేశరక్షణ చట్టంయొక్క ఉద్దేశ్యాలకే విరుద్ధమని చెప్పవలసి వుంటుంది.

గుంటూరు జిల్లాలో ముఖ్యంగా కమ్యూనిస్టుపార్టీ గొప్ప ఊరేగింపులద్వారా రాజకీయ ప్రబోధంచేసి ప్రజలలో ఫాసిస్టు వ్యతిరేకతనూ, దేశరక్షణ బాధ్యతను రగుల్కొల్పుతూంది. కరువు కాటకాలనుపోగొట్టి, ఫాసిస్టు ప్రమాదాన్నుండి దేశాన్ని జయప్రదంగా రక్షించాలంటే, ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న కాంగ్రెసు నాయకులను విడుదలచేసి, లీగ్-కాంగ్రెసు నాయకులతోకూడిన జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించాలని ప్రచారం చేస్తోంది. దేశభక్తితో ప్రజలు ఆహారపదార్థాలను తిండిదొంగల నుండి కాపాడుకొని, అందరికీ సర్దుబాటుచేసుకొంటూ అధికాహారోత్పత్తిచేసి యుద్ధరంగంలో పోరాడే సైనికులకు, ప్రజానీకానికి, సప్లయిచేయాలని ప్రబోధించుతూంది.

ఈవిధంగా ప్రజలను దేశరక్షణకొరకు, జాతీయ ప్రభుత్వంకొరకు ప్రజలను సమీకరించుతున్న కమ్యూనిస్టుల ప్రచారాన్ని కొలదిమంది దుండగీడులు, విచ్ఛిన్నకులు ఎదిరించుతున్నారు. వీరి అల్లరికి జంకి, శాంతికి భంగం జరుగుతుందని మేజిస్ట్రేటు ఉత్తరువు జారీచేయడంలో అర్థంలేదు. పైగా అట్టివారికి సహాయంచేస్తూంది. అన్నిరకాల ప్రజాసమీకరణను ఆటంకపరుస్తూంది. ప్రజల పౌరసత్వహక్కులకే అడ్డు తగులుతూంది. మిత్రరాజ్య యుద్ధకృషికి, కరువు నివారణకై ప్రజాసమీకరణ చేయడానికీ, అభ్యంతరం కలిగించుతూంది.

అందుచే గుంటూరుజిల్లా మేజిస్ట్రేటు యీ ఉత్తరును జారీచేయడం సబబు కాదు. కనుక వెంటనే దీనిని ఉపసంహరించుకోవాలని హెచ్చరించుతున్నాము. ప్రజాసంస్థలు, సోదర పత్రికలు యిందుకొరకు ఆందోళన చేయాలని కోరుతున్నాము.

★

"సి" క్లాసు ఖైదీల మజ్జిగ

మద్రాసు ప్రభుత్వం 'సి' క్లాసు ఖైదీలకు యిస్తున్న మజ్జిగను మానివేయాలని ఆలోచించుతున్నట్లు, అందువిషయమై ఉత్తరువులు జారీచేసినట్లు, విడుదలైన రాజకీయ ఖైదీలనుండి తెలుస్తూంది. 1938 లో కాంగ్రెసు మంత్రివర్గం 'సి' క్లాసు ఖైదీలకు మజ్జిగ యివ్వాలని తీర్మానించింది. ఈ సౌకర్యం కలుగజేసినప్పటినుండి అదివరకు 'ముద్ద-పులుసు' మాత్రమేవున్న 'సి' క్లాసు ఖైదీల ఆహారం కొంచం బాగుపడింది. అదివరకు ఖైదీలు ఎక్కువగా బాధపడుతుండిన జిగట విరోచనాలు వగైరా రోగాలు తగ్గిపోయి ఆరోగ్యం కొంతవరకు బాగుపడింది.

కాంగ్రెసు మంత్రివర్గం కలుగచేసిన యీ స్వల్ప సౌకర్యాన్ని మద్రాసు ప్రభుత్వం తొలగించాలని ఆలోచించుతూండటం శోచనీయం. మానవుని పోషణకు చాలీచాలని 'సి' క్లాసు ఖైదీ ఆహారంలోనుంచి రోజుకు యివ్వబడుతున్న అరపైంటు మజ్జిగ నీళ్ళను తగ్గించడం సబబుకాదు. అందువల్ల వెనుకటివలెనే జిగటవిరోచనాలు వగైరా జబ్బులు హెచ్చి, మందులకు అదనంగా ఖర్చు చేయవలసివస్తుంది. అంతేగాక ప్రజాప్రతినిధులైన కాంగ్రెసుమంత్రులుచేసిన యీచిన్న జైలుసంస్కరణను కూడ అడ్వయిజర్ల ప్రభుత్వం రద్దుచేయడం నిరంకుశత్వ మనిపించుకొంటుంది. అందుచే మద్రాసు ప్రభుత్వం వెంటనే తమ ఉత్తరువును ఉపసంహరించుకొని 'సి' క్లాసు ఖైదీలకిస్తున్న మజ్జిగను యిస్తూవుండాలని మేము ప్రభుత్వాన్ని హెచ్చరించుతున్నాము. వివిధ ప్రజాసంస్థలు, సోదర పత్రికలు, యీ విషయమై ఆందోళన చేసి, ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతున్నాము.

★ మన రాజకీయాలు

తన నియోజకవర్గంలోనే ఆమెరీ మాట్లాడలేకపోయాడు!

— కంభంపాటి సత్యనారాయణ

అట్లాంటిక్ ఛార్టరు ఇండియాకు వర్తించదని చర్చిల్ ప్రధాని ఏనాడు పార్లమెంటులో ప్రకటించాడో, ఆనాటినుంచీ బ్రిటన్ - అమెరికాలలో విపరీతమైన తుపాను చెలరేగింది. యుద్ధంలో ప్రజాపక్షం గెలవడానికి మనం కోరే స్వాతంత్ర్యహక్కును బ్రిటిషుప్రభుత్వం గుర్తించడం, ఇండియాకు అట్లాంటిక్ ఛార్టర్ వర్తింపజేయడం, అవసరమంటూ ఆందోళన బయల్దేరింది. మన జాతీయ నాయకుల్ని విడుదలచేసి, వారి సహకారంతో జాతీయ ప్రభుత్వాన్ని నిర్మించాలనే నినాదం ఊరేగింపులలోను, సమావేశాలలోను, ప్రతిధ్వనించింది. భారతజాతీయ వాంఛనుగురించి ప్రచారం చేయడానికి అనేక కొత్తసంస్థలు బయల్దేరాయి.

మన స్వాతంత్ర్యంపట్ల వ్యతిరేకత బ్రిటిష్ సామ్రాజ్యవాదులకే గాని, బ్రిటిష్ ప్రజలకు ఏముంది?

ఈవిధంగా నానాటికి వృద్ధిచెందుతూన్న ప్రజాందోళన ఒకవైపు: తమ సామ్రాజ్యాన్ని యీ అంతిమ ఘడియలలో యెలాగైనా నిలబెట్టుకుందామనే ఆదుర్దా మరొకవైపు - ఇదీ నేడు బ్రిటిష్ అధికారవర్గం యొక్క సందిగ్ధావస్థ! మొన్న 8 వ తేదీని ఇండియామంత్రి అమెరీ పత్రికా ప్రతినిధుల సమావేశంలో గావించిన ప్రసంగం యీ సందిగ్ధావస్థనే ప్రతిబింబించింది. అప్పుడతడు చెప్పిన మాటలు యివి:

అమెరీ ప్రసంగం

"అట్లాంటిక్ ఛార్టర్‌లో ఉన్న సూత్రాలను మేం ఆచరణలో పెడుతున్నాం. ఇండియాకు అట్లాంటిక్ ఛార్టర్ వర్తించకుండా చేయడం మా ఉద్దేశం అంటూ కొందరు ఎందుకు కట్టుకథ అల్లారో నాకర్థం కావడంలేదు. చర్చిల్ ప్రధాని, రూజ్వెల్టు ఆధ్యక్షుడు కలిసి సమావేశం కాకముందే, చాలాకాలం నుంచీ దాన్ని అమలు జరుపుతున్నాం. 18 నెలల క్రితం క్రిప్పుద్వారా ప్రతిపాదించబడిన ప్రకటన అట్లాంటిక్ ఛార్టర్‌ను అమలుపరచడం తప్ప మరొకటికాదు. ఆ ప్రకటనే తు-చ తప్పకుండా, బహుకొద్ది మార్పులతో, రేపు విముక్తి కాబోయే యూరపియన్ దేశాలకు కూడా వర్తింపజేయ బడుతుంది."

ఈమాటల అర్థంఏమిటి? చర్చిల్‌పాడిన పాతపాటను వల్లించడానికి ఆమెరీ సాహసించలేకపోయాడు. అట్లాంటిక్ ఛార్టరు తప్పకుండా ఇండియాకు వర్తిస్తుందనే దృక్పథం తీసుకోవలసి వచ్చింది. తన నియోజకవర్గంలోనే వేలకొద్దీ వోటర్లు యెంత బలమైన ఒత్తిడి తీసుకొస్తున్నారో అమెరీ గుర్తించవలసి వచ్చింది. కాని, పరిపాలకవర్గం యొక్క సామ్రాజ్యతృష్ణనుకూడా అమెరీ ప్రతిబింబిస్తున్నాడు. మనదేశంలో యిప్పుడు అట్లాంటిక్ చార్టరు సూత్రాల ప్రకారమే పరిపాలన సాగుతోందని యెవ్వరూ భావించరు. ఫాసిస్టు వ్యతిరేకులైన కాంగ్రెసు నాయకుల్ని జైళ్ళలోబంధించి, వారు సమావేశం కావడానికికూడా అవకాశం యివ్వకపోవడాన్ని అట్లాంటిక్ ఛార్టర్‌లో యేసూత్రం అంగీకరించింది? ఈ కల్లిబొల్లిమాటలతో బ్రిటిష్ ప్రజల్ని సంతృప్తిపరచాలని ప్రయత్నించడం ఎంత వెర్రితనం!

అమెరీసభలో గల్లంతు

ఈ ప్రసంగం అమెరీ నియోజకవర్గంలోనే కావలసినంత అసంతృప్తిని కలిగించింది. 10 వ తేదీని, అనగా యిదిజరిగిన రెండో రోజుసాయంకాలం, బర్మింగ్‌హాంలో ఇండియాకార్యదర్శి ఉపన్యసించడానికి వచ్చాడు. అతడు ఉపన్యసిస్తున్నంతసేపూ సభలో విధి - విరామంలేకుండా నానాగల్లంతు, గందరగోళం జరిగింది. ఉపన్యాసకునిమీద ప్రశ్నల వర్షం కురిసింది. ప్రేక్షకులలో ఒక వ్యక్తి తీర్మానం ఒకటి ప్రవేశ పెట్టడానికి ప్రయత్నించగా, అతడు సభాభవనంనుండి బయటికి నెట్టివేయబడ్డాడు. మరొక ప్రేక్షకుడు వేదిక యెక్కి ఉపన్యసించడానికి ప్రయత్నించాడు. మళ్ళీ గల్లంతుప్రారంభమైంది. ఉన్న పోలీసు సిబ్బంది చాలక, కొత్తపోలీసుల్ని సైతం పిలిపించవలసి వచ్చింది. సభావేదికపై ఉన్నవారు సామ్రాజ్య గేయాన్ని పాడసాగారు. వెంటనే ప్రేక్షకులు

"ఆకలిమంటచె మలమలమాడే
అనాథులందరు లేవండోయ్!"

అంటూ అంతర్జాతీయగేయం పాడారు. ఈవిధంగా సభ సమాప్తమయింది.

ఈ సమావేశానికి ముందునుంచీ అమెరీ ఏజంట్లు తమ ముఠాను యెక్కువగా సమీకరించడానికి సర్క్యులర్లు, ఉత్తరువులు, జారీచేశారట! అయినప్పటికీ, సభ పైవిధంగా సమాప్త మయిందంటే, బ్రిటిష్‌ప్రజల ఆందోళన, మన స్వాతంత్ర్యంపట్ల వారుచూపే పట్టుదల, ఎంత ఎక్కువో పాఠకులు ఊహించుకోవచ్చును.

సాధారణంగా మన దేశభక్తులు బ్రిటిష్ పరిపాలకవర్గం యొక్క మొండి విధానాన్ని మాత్రమే చూస్తున్నారు తప్ప, బ్రిటిష్ ప్రజాసామాన్యం చేసే ఆందోళనయొక్క తీవ్రతను గుర్తించడం లేదు. ఒకే చిత్రపటంమీద రెండు వైపుల రెండు ముఖాలున్నాయి. ఒకటి సామ్రాజ్యవాద పాలసీని చూపుతోంది. రెండోది ప్రజల ఒత్తిడిని చూపుతోంది. రోజురోజుకూ యీ ఒత్తిడి అధికమై, సామ్రాజ్యవాదుల్ని యిరకాటంలో పెడుతోంది. బ్రిటిష్ ప్రజలు మన స్వాతంత్ర్య పోరాటంలో చేదోడు వాదోడుగా ఉంటారనే విషయం దేశభక్తు లిప్పటికైనా గ్రహించవలసియుంది. గ్రహించి, తమపైకూడా ఎంత ఎక్కువ బాధ్యతఉందో తెలుసుకోవలసి యుంది.

లెబనాన్ - ఈరాన్‌ల ఉదంతం

లెబనాన్, ఈరాన్, దేశాల ఉదంతం యీ విషయంలో మనకు మార్గంచూపుతుంది. అట్లాంటిక్‌ఛార్టర్ యూరపియన్ దేశాలకు మాత్రమే వర్తిస్తుందని చెప్పిన చర్చిల్ ప్రభుత్వం యీనాడు లెబనాన్, ఈరాన్ దేశాల స్వాతంత్ర్య హక్కును గుర్తించక తప్పిందికాదు. ఈరెండు దేశాలూ యూరప్‌ఖండంలోనివికావు. లెబనాన్ ఫ్రెంచి మేండేటరీ అధికారం కింద, ఈరాన్ బ్రిటిష్ పలుకుబడి కింద, ఉన్నాయి. లెబనాన్ ప్రజల స్వాతంత్ర్య కాంక్షను అణచడానికి అక్కడి స్థానికాధికారులు నిర్బంధ ప్రయోగం చేసినప్పుడు, బ్రిటిష్ ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి జంకి జోక్యం కలుగజేసుకొని, లెబనాన్ నాయకుల్ని విడిపించేటట్లుచేసి, తిరిగి వారి ప్రభుత్వాన్ని అంగీకరించవలసి వచ్చింది. ఇలాగే, మొన్న టెహరాన్ (ఈరాన్‌కు ముఖ్యపట్నం) లో జరిగిన బ్రిటిష్ - అమెరికన్ రష్యన్ ప్రభుత్వాల సమావేశంలో ఈరాన్ యొక్క సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని గుర్తిస్తూ తీర్మానించారు.

ఈరాన్ ప్రజలుగాని, లెబనాన్ ప్రజలుగాని, యుద్ధంపట్ల తటస్థంగాలేరు. ప్రజాపక్షమే గెలవాలనీ, ఫాసిజం నాశనంకావాలనీ, కోరుతూవచ్చారు. అందుకు మిత్రరాజ్యాల యుద్ధకృషికిపూర్తిగా (తరువాయి 7వ పేజీలో)

★

తిండిదొంగ

శెట్టి ఈశ్వరరావు

రాత్రి పదకొండు దాటింది. తాళ్లుకట్టిన కళ్ళద్దాల్లోంచి వీరయ్య 'అసలు చిట్టా' లెక్కలు చూసుకుంటున్నాడు. ఇన్‌కంటాక్సు లెక్కలకోసం ప్రత్యేకం యింకొక చిట్టా వుంటుంది. పంచపాళీలోవున్న బోనుపెట్టెలోంచి 'అసలుచిట్టా' నడిరాత్రప్పుడు మాత్రమే తీస్తాడు. ముసలి గుమస్తా తలవంచుకొని 'ఇన్‌కంటాక్సు' చిట్టా రాస్తున్నాడు.

యుద్ధం ప్రారంభమయాక ఇప్పటిదాకా వీరయ్యకి బియ్యం వ్యాపారంలో వచ్చిన లాభాలు ఆరులక్షలకు తక్కువుండదు. ఆ ప్రాంతాలకి పెద్ద మోతుబరి. మూడు బియ్యం మిల్లులున్నాయి. జిల్లా జిల్లా కంతటికి పేరు మోసిన దివ్యమైన వ్యాపారముంది.

ఊడుపులుకాకమునుపే రైతులకి బజాణాలిచ్చి మంచి కిమ్మత్తుగా ఖరీదుచేసేడు. కొన్న ధాన్యమంతా లోపాయికారీగా నిలవచేసేడు.

"నాన్నా, ఉన్నదంతా ధాన్యానికే మదుపు పెట్టేసేవు—ఎప్పటి కెలాగుంటుందో—" అని కొడుకు జడుస్తుంటే, "ఓ రుండరా, బుగ్గి బంగారమయ్యే రోజు లొస్తున్నాయి" అని కొడుక్కి నిబ్బరం యిచ్చేడు.

బుగ్గి బంగారమయ్యే రోజు లొచ్చేయి. రూపాయికి మూడు సేర్ల బియ్యం రోజులు. రాయలసీమలో మట్టిగడ్డలు తినే రోజులు, వారం వక్కంటికీ నలభై వేలకు పైగా బెంగాల్లో పీనుగులు పెంటలుగా పడే రోజులొచ్చేయి. కరువువల్ల కలరా అల్లుకపోయి మలబారు మంటగలిసే రోజు లొచ్చేయి. వీరయ్యకి లాభం ఆరు లక్షల రూపాయలొచ్చేయి. ఏకాదశికి రెండువందల మంది బ్రాహ్మణులకు పిండివంటలతో సంతర్పణ చేసి, సత్యనారాయణవ్రతం చేసేడు. ఆంజనేయ స్వామికి అభిషేకాలు చేయించేడు.

గుమస్తా చిట్టా రాయడంకాలేదు. కునుకుపాట్లు పడుతూ రాస్తూనేవున్నాడు. ఆవులించి మిట్టకాయలేస్తూ, పక్కనున్న పత్రిక తీసేడు వీరయ్య. పత్రిక రోజూ తప్పకుండా చూస్తాడు బజారు ధరలకోసం. ఏమీతోచకపోతే యెప్పుడైనా వార్తలుకూడా చదువుతాడు. అగ్గిబొద్దు కొట్టి, సగం కాల్చిన చుట్ట ముట్టించి చదువుతున్నాడు వీరయ్య.

కేంద్ర శాసనసభలోనూ, హౌస్ ఆఫ్ కామన్సులోనూ భారతదేశపుకరువునుగురించి చర్చలు. కలకత్తాలో నూట నలుగురు తిండిలేనివాళ్ళు చచ్చిపోయేరు. ఆకలికి శోషతో పడిపోయివున్న వాడి కాలు, నక్క పీక్కొని తిన్నాది— వీరయ్యకు వొళ్ళు జల్లుమంది. "రామ రామా" అని ఎంతో నొచ్చుకున్నాడు. ఆ నక్కకన్నా తనలాంటివాళ్ళేమీ తీసిపోలేదని, ఆలోచించి అతనెప్పుడూ తెలుసుకోలేదు.

కళాసీ గాభరాగా పరుగెత్తుకొచ్చేడు. వీరయ్య తుళ్ళిపడ్డాడు.

వీరయ్యకి గుండెదడ పట్టుకుంది—"ఏంరా? ఏంరా?"

"ఆ కుర్రోళ్ళందరూ బళ్ళు నిలబెట్టేసేరు బాబూ!"

పక్కవూళ్ళో దాచిన పదిబళ్ళ బియ్యం చీకటిమాటున తెప్పించడానికి ఏర్పాటుచేసేడు వీరయ్య. ఆహారసంఘం వాలంటీర్లు యిది పసికట్టి, తోవకాసి బళ్ళు నిలబెట్టేరు. బళ్ళొస్తాయిగదా అని వీరయ్య యింతవరకూ కనిపెట్టుక్కూచున్నాడు.

"నేను జడిసిందే అయిందిరోయి దేవుడా! —కళాసీలందరెళ్ళి యిడిపించుకుని రండి—"

ఇంతకు మునుపొకసారి యిటువటిదే జరిగితే కళాసీల్ని పంపేడు. వాళ్ళు వాలంటీర్లని చితగ్గొట్టి బళ్ళు తోలుకొచ్చేరు.

"లాభం లేదండి, చాలామంది పోగైపోయేరు" అని కళాసీ సమాధానంయిచ్చేడు.

"మేజిస్ట్రీటుని తీసుకొచ్చి యీళ్ళ కొవ్వణిగిస్తాను — దొంగ లంజ కొడుకులు!" చిలక్కొయ్యకున్న లాల్చీ, వాణీ గబగబా వేసుకొని వీరయ్య మేజిస్ట్రీటు యింటికి బయల్దేరేడు.

మేజిస్ట్రీటు వీరయ్యని కాదనలేడు. మేజిస్ట్రీటుకి వీరయ్య మొహమాటం వుంది.

కరువు మరీయెక్కువయిం తరువాత, ఊళ్లోవాళ్ళందరూ కలసి ఆహారసంఘం ఒకటి పెట్టుకున్నారు. చాలమంది కుర్రవాళ్ళు వాలంటీర్లుగా చేరారు. కంట్రోలు డిపో దగ్గర కుమ్ములాట్లు జరక్కుండా, వర్తకులు దగా చెయ్యకుండా, అందరూ కట్టుగా పనిచేస్తున్నారు. సమయం దొరికినప్పుడల్లా వర్తకులు ధరలు బిగించేస్తూనే ఉన్నారు. ఊరంతా సభలుచేసి, కలక్టరుమీద ఒత్తిడితెచ్చి, తక్కువధరలకు బియ్యం అమ్మించవలసిందని ఆహారసంఘం ఆందోళన చేసింది. చాటునామాటునా వర్తకులు నిలవచేసిన సరుకును వాలంటీర్లు బయటికి లాగుతున్నారు.

ఆహారసంఘంవాళ్ళు వీరయ్యకీ తక్కిన వర్తకులకీ చాలాచెప్పేరు, అధికలాభాలకోసం ప్రజల్ని మాడ్చిచంపొద్దని బతిమాలారు. న్యాయమైన ధరలకమ్మమని ప్రాధేయపడ్డారు. బెంగాల్ సంగతిచెప్పి, తక్కిన ప్రాంతాలకూడా ఆగతిపట్టకుండా కాపాడి పుణ్యం దక్కించుకోమన్నారు. దోపిళ్ళు, అరాచకమూ వస్తుందన్నారు. ఈఅల్లకల్లోలంవల్ల జపానువాణ్ణికోరి పిల్చినట్టవుతుందనీ, దేశద్రోహానికొడిగట్టుకోవద్దనీ చెవినిల్లు కట్టుకొని పోరుపెట్టేరు. వర్తకులు మావల్లనేమవుతుందన్నారు. తప్పంతా ప్రభుత్వంమీదతోసేసేరు.

"వీళ్ళకెందుకో ఈ దురద - పనిలేని మంగలి పిల్లిబుర్ర గొరిగేడట" అంతా విని వర్తకసంఘం నాయకుడు వీరయ్య అపహాస్యంచేసేడు.

ఆహారకమిటీ పనికి పూనుకున్న తరువాత వర్తకుల ఆటలుసాగలేదు. ప్రభుత్వ ఉద్యోగస్తులు వర్తకుల మొహమాటాన్ని వదలి ప్రజలకు లొంగక తప్పిందికాదు. ఆహారసంఘం వర్తకులు మారుమూలల్ని దాచిన సరుకును ముందుకులాగి, కంట్రోలు ధరలకమ్మిస్తున్నారు. అధికధరల కమ్మినవాళ్లని పట్టుకొని దావాలుచేసి జరిమానాలు వేయిస్తున్నారు. తిండిదొంగల్ని రచ్చకీడుస్తున్నారు.

ఆహారసంఘం కార్యదర్శితో యీమాటా ఆ మాటా చెప్పి, ఐదునూరు రూపాయిల కాగితాలు చేతిలో పెట్టబోయేడు వీరయ్య. మర్యాదగా అతనుచీవాట్లు పెట్టాడు. "ఎంతపొగరు! దొంగలంజాకొడుకులకి" అని నలుగురు వర్తకులకు చెప్పేడు వీరయ్య.

వీరయ్య మేజ్రీటు ఇంటికెళ్లి - గదిలో చాలాసేపు మాట్లాడి - బళ్ళు నిలబెట్టినచోటికి యిద్దరూ కలసి వొచ్చేరు.

అంత రాత్రయినా బళ్ళచుట్టు ఒక వెయ్యిమంది జనం గుమిగూడేరు. అభమూ శుభమూ యెరగని ఎడ్లు నిరపరాధుల్లాగ నిలబడివున్నాయి. అంతదూరంలో వీరయ్యనీ మేజ్రీటునీ చూడగానే, చీకటి కంపించేటట్టు జనం నినాదాలు చేశారు.

"అధికలాభాల్ని - అరికట్టాలి!"

"తిండిదొంగలకు - బుద్ధిచెప్పాలి!"

ఏడుస్తున్నవాడ్ని వెక్కిరించి నట్టయింది వీరయ్యకి. తన పదవికేదో అగౌరవం జరుగుతున్నట్టు మేజ్రీటుకి ఒళ్ళుమండింది.

"బళ్ళాపింది ఎవర్రా యిందులో?" అని ఉరిమేడు మేజ్రీటు రుసరుసలాడుతూ.

ఎవరూ మాటాళ్ళేదు.

"ఏం? మాటాడరేం?" అని మళ్లా గద్దించేడు.

ఐదుగురు వాలంటీర్లు ముందుకొచ్చి నిలబడ్డారు.

"మీరేనా బళ్ల ఆపేరు?"

"అఁ, మేమే!"

"వాట్నాపడానికి మీకెవడిచ్చేడధికారం? ఓయ్ జమాన్లు! వీళ్ళని యెరస్టు చెయ్యండి" కనిస్టేబులవేపు తలవిసిరి చెప్పేడు మేజ్రీటు.

ప్రజల్లో పెద్ద అలజడి ప్రారంభమైంది. "దొంగసరుకు పట్టుకొని ఆపితే, అరెస్టు చెయ్యడానికి నీకేం అధికారం వుంది?" "వీరయ్యతో నువ్వు ఏకమవ్వడానికి కారణం ఏవిఁటి?" "వాలంటీర్లని ఒదిలిపెట్టిస్తావా, లేకపోతే యీసంగతి కలక్టరుకి తెలియజెయ్యమంటావా?"—తోచిన తలొక ప్రశ్న వేసి, జనమంతా మేజ్రీటుకి ఊపిరాడకండా చేసేరు. బెదిరింపులకి లొంగేస్థితిలో లేరని మేజ్రీటు కనిపెట్టేడు. వాలంటీర్లని వొదిలిపెట్టెయ్యమని కనిస్టేబులకి ఆజ్ఞచేసేడు.

వీరయ్య కాళ్ళ బేరాని కొచ్చేడు. ప్రజలకి నచ్చజెప్పబోతున్నాడు. "సర్ విజయా వొచ్చినప్పుడు రాయలసీమకరువుకి నేను వెయ్యిరూపాయిలివ్వలేదా?— ప్రజలకడుపు నేను కొడతానా?"

సర్ విజయా వొచ్చి సభచేసినప్పుడు రాయలసీమకరువునిధికి వెయ్యిరూపాయలిస్తానని వీరయ్య వేదికమీద నిలబడి, చెప్పించేడు. విజయాగారు కరస్పర్శచేసేరు. సభలో వున్న, తెల్లనివన్నీ పాలనుకొనేవారు చప్పట్లు కొట్టేరు. వీరయ్యకి బ్రహ్మానందమయింది.

నూతిలోపడదోసి, దారంపోగు సాయానికివేసినట్టు వుందని గుసగుసలు పుట్టేయి.

"సరే, మీరంతా పొండి యిక్కణ్ణుంచి" బళ్లు తోలించుక వెళ్లిపొమ్మని వీరయ్యకి అధికారం యిస్తున్నానన్నట్టు, ప్రజలు జడుస్తారన్న ఆశతో అరిచిచెప్పేడు మేజ్రీటు.

కానిప్రజలు ఇలాంటి అనుభవాల్తో చేవదేరిపోయివున్నారు. పదిబళ్ళబియ్యమూ కంట్రోలుధరలకు మేజ్రీటు అమ్మించనైనా అమ్మించాలి. లేకపోతే ఆహారసంఘం అమ్మి ఆ పైసలతో డబ్బు ఒప్పజెప్పనైనా చెపుతుంది, అని జనం పట్టుపట్టేరు. బళ్ళు వీరయ్యపరం చెయ్యడానికి తన అధికారాన్ని, న్యాయసూత్రాల్ని, మాటల్లో నక్కజిత్తుల్ని ఉపయోగించి చాలా ప్రయత్నించేడు మేజ్రీటు. ప్రజలు పట్టిన పట్టు వదల్లేదు. మరి లాభంలేదని, ఆహారసంఘం పూచీమీద ఆబియ్యం కంట్రోలుధరల కమ్మడానికి మర్నాడుదయం ఏర్పాటుచేస్తానని ఒప్పుకొని, కనిస్టేబుల్ని బళ్లకు కాపలాపెట్టి మేజ్రీటు తలవంచుకొని వెళ్ళిపోతున్నాడు. ఆహారసంఘం యిరవైమంది వాలంటీర్లని బళ్ళకు కాపలాపెట్టింది.

మేజ్రీటు వెనకాతలే వీరయ్య యింటితోవపట్టేడు.

"తిండిదొంగ, తిండిదొంగ" అని పిల్లలు కేరింతలు కొడుతున్నారు.

కళాసీ దీపం పట్టుకొని ముందు నడుస్తున్నాడు. గుడ్డివెల్తుర్లో మేజ్రీటూ - వీరయ్యా తెల్లబోయిన ఒకరిమొఖం ఒకరు చూసుకున్నారు.

2 లక్షల నిధిని పూర్తిచేయండి!

వెనుకటి త్యాగప్రమాణాన్ని, సాంప్రదాయాన్ని ముందుకు తీసుకుపోండి

★

లెనిన్ దినం పరుగెత్తుకొస్తోంది. కాని, మనం ఆనాటికి పూర్తిచేయాల్సిన నిధిలో నాలుగోవంతు కూడా పూర్తిచేయలేదు.

ఇంతవరకు, 42,000 రూ. మాత్రమే వసూలుచేశాం. విశాఖ, తూర్పుగోదావరి, అనంతపురం జిల్లాలు మాత్రమే తమ కోటాలను పూర్తిచేశాయి. ప్రధాన జిల్లాలైన కృష్ణ, గుంటూరులు మూడోవంతు మాత్రమే పూర్తిచేశాయి.

ఇంతవరకుజిల్లాలనుండిరాష్ట్రకమిటీకిచేరిన పార్టీఫండు వివరాలు ఈదిగువఇస్తున్నాం:

జిల్లా	వసూలుచేసినది	కోటా
వైజాగ్	498	500
తూ॥ గో॥	2,600	1000
ప॥ గో॥	—	10,000
కృష్ణా	14,518	50,000
గుంటూరు	13.600	30,000
నెల్లూరు	—	5,000
చిత్తూరు	—	400
అనంతపూర్	514	500
కడప	54	300
కర్నూలు	250	—
స్టేటు	76	—
రాష్ట్రకమిటీ	10,250	—
	42,360	

రోజు రోజుకూ మనపార్టీ బలపడుతోంది. విస్తరిస్తోంది. పార్టీ పంథా రాష్ట్రంలో మారుమూలలకు చొచ్చుకొని పోతోంది. ప్రజల సానుభూతిని పొందుతోంది. ఈ పరిస్థితుల్లో, మనపార్టీ నిర్మాణాన్ని బలీయంగా, అభేద్యంగా చేయాలంటే, పార్టీ ఆర్థికస్థితిని ఉక్కు పునాదులమీద నిర్మించాలి. ఇది చేయాలంటే, రెండులక్షల నిధిని త్వరలో పూర్తిచేయాలి.

కాబట్టి,

పార్టీ సభ్యులను, సానుభూతిపరులను మేము హెచ్చరించే దేమంటే —

క్రిందటి సంవత్సరం, కాలపరిమితి దాటకుండానే, లక్షరూపాయల నిధిని మించి (లక్ష అరవైవేలు) వసూలుచేశాం. పార్టీ సభ్యులు తమ తమ ఆస్తులమ్మి, కాంగ్రెసు కూడా నిర్మించని త్యాగసాంప్రదాయాన్ని నిర్మించారు. దేశంలో, తక్కిన అన్ని రాష్ట్రాలకంటే మించిపోయాం. మార్గదర్శకులమయ్యాం. ఆదర్శప్రాయుల మయ్యాం.

కామ్రేడ్సు! జాతీయ ఐక్యతవారంలో చూపించిన కార్యదీక్ష, చురుకుదనం, బొక్షె విక్కుపోటీ, ఇంకా ఎక్కువచేసి, ముందుకు చొచ్చుకొని పోకపోతే, ఇదివరకు మనం నిర్మించిన ప్రమాణాలనుండే, సాంప్రదాయాలనుండే దిగజారిన వారమవుతాం.

కావున —

మీరు అమ్మదలచుకొన్న మీ ఆస్తులను త్వరలో అమ్మండి. సానుభూతిపరులనుండి వసూలు జేయదలచుకొన్న నిధిని వెంటనే వసూలుచేయండి. మీపరిచయంలో ఉన్న, అందుబాటులోఉన్న ప్రతి దేశభక్తుని నుండి ఫండును వసూలుచేయండి.

ప్రజాసేవకులకు, ప్రజల సానుభూతికి, ప్రేమకు ఏమీ కొరతలేదు. ఒక్క వారం రోజుల్లో (ఐక్యతావారంలో) 23,000 మంది నుండి, హిందూ-ముస్లిం-క్రిస్టియను, కార్మికులు, రైతులు, కూలీలు, విద్యార్థులు, యువతులు, యువకులనుండి, 9,500 రూ. వసూలుచేశామంటే, మరి అర్థమేమిటి?

కాబట్టి,

పార్టీసభ్యులు, సానుభూతిపరులు నడుంబిగించండి. ఇంకాఎక్కువత్యాగంచూపించండి. ఆత్మవిశ్వాసంతో ప్రజలవద్దకుపొండి. లెనిన్ దినానికిముందే, 2 లక్షలనిధిపూర్తిఅవుతుంది.

రాష్ట్రకమిటీ — భారత కమ్యూనిస్టుపార్టీ.

ఆంధ్రవిద్యార్థుల బెంగాలు పర్యటనం

నవంబరులో బొంబాయిలో సమావేశమైన అఖిలభారత విద్యార్థి ఫెడరేషను కార్యనిర్వాహకవర్గం బెంగాలులో నేడు వ్యాపించియున్న క్షామపరిస్థితులను పరీక్షించి, ఆయా రాష్ట్రములలోని విద్యార్థులను బెంగాలు రక్షణకు సమీకరించుటకుగాను పంజాబు; ఆంధ్ర; తమిళనాడు; సంయుక్తరాష్ట్రములనుండి ప్రతినిధివర్గాలను పంప నిశ్చయించింది.

ఆంధ్రరాష్ట్ర విద్యార్థిఫెడరేషను బెంగాలు పర్యటనకై యీ క్రిందివారిని పంప నిశ్చయించింది.


1. యస్. వి. నరసయ్య (దళనాయకుడు)
2. ఏ. విచ్చేశ్వరరావు (కృష్ణాజిల్లా)
3. యన్.వి. నారాయణ(గుంటూరుజిల్లా)
4. డి. సురేంద్రనాథ్ (తూ॥ గో॥ జిల్లా)

ఈ ప్రతినిధులు 18 వ తారీఖున బెజవాడ నుండి బయలుదేరి 20 నాటికి కలకత్తా చేర్తారు. డిశంబరు 20 నుండి, జనవరి 3 వరకు బెంగాలులోని క్షామపీడితజిల్లాలలో పర్యటన చేసి 5 వ తారీఖుకు ఆంధ్రరాష్ట్రమునకు తిరిగి వస్తారు. తాము స్వయంగా చూచివచ్చిన విషయాలను ఆంధ్ర విద్యార్థిలోకంలో ప్రచారం చేసి, ఆంధ్రవిద్యార్థులు బెంగాలుకు అధికతర సహాయం చేసేలా కృషి సల్పుతారు.

★

విజయనగర విద్యార్థిసంఘం విద్యార్థులకు కావలసిన కాగితం, కిరసనాయిలు సప్లయి జరిగేలా కృషి చేసింది. మొదట కాలేజీ ప్రిన్సిపాల్ దగ్గరకు రాయబారం వెళ్ళారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి, వారి కోరికలను బలపరుస్తూ స్థానికాధికారుల దగ్గరకు పంపారు. తరువాత విద్యార్థులు కూడా కలక్టరు దగ్గరకు రాయబారం వెళ్లారు. విద్యార్థుల సూచనలకు అధికారు లంగీకరించి, కాగితం తెప్పించి దస్తా 0-5-0 చొ॥ సప్లయి చేస్తున్నారు. 200 గేలన్ల కిరసనాయిల్ తెప్పించి కోఆపరేటివ్ స్టోర్సు ద్వారా సప్లయి చేయాలని కలక్టరు సూచించారు. కాని స్టోర్సువారు తమ ఇష్టంవచ్చిన ఆట ఆడబోయారు. విద్యార్థులా ఆటను సాగనివ్వక, తిరిగి కలక్టరుకు రిపోర్టుచేశారు. విద్యార్థి సంఘం పట్టణంలోని 28 లాడ్జీలలోని 180 మంది విద్యార్థుల లెక్కలుతీసి కాలేజీ సంస్కృత పండితునిద్వారా స్టోర్సు కందజేశారు. స్థానిక జాతీయ విద్యార్థి సంఘం ఈ లెక్కలను గుర్తించమని వాదించారు. దానిపై సంస్కృత పండితుడు కిరోసిన్, కాగితంపై విద్యార్థి సంఘం జరిపిన కృషిని వివరిస్తూ, ఈ పనికి అడ్డు తగిలే సంకుచిత భావం గలవారు జాతీయవాదులనిపించుకోలేరని మందలించారు.

19 వ ఆంధ్రరాష్ట్ర విద్యార్థి మహాసభలో



వైజ్ఞానికసభ : శ్రీ తాపీ ధర్మారావుగారు ఉపన్యసిస్తున్నారు

అనంతపూర్ జిల్లా విద్యార్థి మహాసభ

1944 జనవరి 14,15 తేదీలలో జరుగును

అధ్యక్షులు : కామ్రేడ్ నర్గీస్ బాట్లివాలా; (బొంబాయి విద్యార్థి ఆర్గనైజరు)

ప్రారంభకులు : కామ్రేడు అమంచర్ల గంగాధరరావు; మాజీ రాష్ట్రవిద్యార్థిసంఘకార్యదర్శి.

వైజ్ఞానిక మహాసభకు అధ్యక్షులు : శ్రీ టి. రాఘవ, బళ్ళారి.

ఉపన్యాసకులు : శ్రీ తాపీ ధర్మారావు, విద్వాన్ విశ్వంగార్లు

స్పోర్ట్సువాగ్వాద సంగీత పోటీలు వ్యాసరచన పోటీలు మొదలగునవి వుండును.

పశ్చిమ గోదావరిజిల్లా మహిళల్లో కొత్త చైతన్యం

ఆ ముసలమ్మకు 80 సంవత్సరాలుంటాయి. మరణశయ్యపై వుంది. ఆ అవస్థలో చాలామందికి "కృష్ణా రామా" అనుకోడమో, లేక మనుషుల్ని మనవరాండ్రనీ దగ్గరపెట్టుకొని ఏడ్వడమో మామూలు. కాని ఈముసలమ్మ కోర్కె వింతగొల్పింది. ఆ వూళ్ళో మహిళాసంఘంవారు ప్రచారం చేయడానికి వచ్చారనివిన్నది. వారినిపిలిపించి, "అమ్మా! మీరు ఆడవాళ్ళ బాగుకోసం వచ్చారట. నేను మీసభకు రాలేను. ఇక్కడే నాలుగుమాటలు చెప్పండి." అని కోరింది.

ఆమె కోర్కెపైన మహిళాసంఘంవారు అక్కడ సభ జరిపారు. ఘోషాకు అలవడ్డ క్షత్రియ కుటుంబాలవడంవల్ల 15 మంది స్త్రీలే వచ్చారు. వారలా సమావేశం అవడంకూడా ఇదేప్రథమం. మృత్యువుతో దెబ్బలాడుతున్న ఆమె మహిళాసమావేశంలో పాటలను, ఉపన్యాసాలను వినగల్గిందోలేదో గాని, ఆమె మూలంగా 15 మంది క్షత్రియ స్త్రీలకు మహిళాసంఘాన్ని గురించి తెలిసికొనే అవకాశం కలిగింది. ఆ సాయంత్రమే ఆ ముసలమ్మ మరణించింది.

ఇది పశ్చిమగోదావరిజిల్లా భీమవరం తాలూకాలో జరిగిన సంఘటన.

నవంబరు 14 నుండి 22 వ తేదీవరకు భీమవరంతాలూకాలోని రాయల, చినమిరం, కోపల్లె, బొండాడ, బుక్కరం, జువ్వలపాలెం, చెరుకుమిల్లి, ఆకివీడు గ్రామాలలో భూపతిరాజు వెంకాయమ్మ, పి. అహల్యాదేవిగార్లు సంచారం చేశారు. మొత్తం 16 సమావేశాలు జరిపి మహిళాసంఘం గురించి, రానున్న జిల్లా మహిళాసభను గురించీ 260 మంది స్త్రీలలో ప్రచారం చేశారు. మహాసభకు రు. 60 లు. పోగుచేశారు. 5 గ్రామాల్లో 40 మందిని మహిళాసభ్యురాండ్రగా చేర్పించారు. బొండాడలో గ్రామమహిళాసంఘం ఏర్పడింది.

ఇలాగే ఇతర తాలూకాలలో సంకు లక్ష్మీకాంతం, యాళ్ళబండి సూర్యకాంతం, దేగల వెంకటరత్నంగారలు 21—11—42 నుండి 4-12-43 వరకు ఈ క్రింది గ్రామాల్లో సంచారం చేశారు : సత్తెపురం, నిడమర్రు, పడమట విప్పరు, పెంటపాడు, దండగర్ర, మారంపల్లి, నిడదవోలు, అత్తిలి. 12 గ్రూపు మీటింగులలో 220 మంది మహిళలలో, మహిళాసంఘావశ్యకతనుగురించీ, అవిద్య-ఘోషా-మూఢాచారాలను తొలగించవలసిన అవసరాన్నిగురించీ ప్రబోధించారు. జిల్లా మహిళాసభను గురించి తెలియజెప్పి ఈ గ్రామాలలో రు254-0-0 లను పోగుచేశారు. నూతనంగా 113 గురిని మహిళాసంఘంలో చేర్పించారు.

పశ్చిమ గోదావరి జిల్లాలో సామాజికంగా కలిగే అభ్యంతరాలను దాటుతూ ఈవిధంగా ముందుకు పోతోంది, మహిళాసంఘం. రేపు 24, 25 వ తేదీలలో జరుగనున్న జిల్లా మహిళాసభ జయప్రద మవుతుందని విశ్వసించడానికి పైనచెప్పిన వార్తలే నిదర్శనం.

* * *

ఇతరజిల్లాలలోగూడ ఇదేవిధంగామహిళాసంఘాలు వృద్ధిచెందుతూ విజయాలు సాధించుతున్నాయి. గుంటూరుజిల్లా రేపల్లెతాలూకా ఐలవరం గ్రామంలో ఒకసామాన్య రైతు తన 20 సెంట్ల స్థలంలో పాకీదొడ్డి కట్టించి ఇచ్చాడు.

ఈతాలూకాలోని పల్లెకోనలో 17-11-43న గ్రామ మహిళాసభ నాదెళ్ళ సుబ్బమ్మగారి అధ్యక్షతను జయప్రదంగా జరిగింది. 90 మంది మహిళలుహాజరయారు. జిల్లామహిళా పరిచారక కమిటీ కార్యదర్శిని సావిత్రిగారు ప్రసూతి సౌకర్యాలు, పాకీదొడ్ల నిర్మాణం, ఆరోగ్యవిధులనుగురించి, రావుకమిటీ బిల్లును గురించి, అధికాహారోత్పత్తిని గురించి తెలియజేశారు. వివప గ్రామసంఘం ఏర్పడింది.

సాయంత్రం 40 మంది స్త్రీలతో ఊరేగింపుజరిగింది. బహిరంగసభకు 400 మంది స్త్రీలు, పలువురు పురుషులు వచ్చారు. సావిత్రీదేవిగారు, కంతంనేని వెంకటసుబ్బయ్యగారు మహిళాసంఘాల ఆవశ్యకత, స్త్రీల హక్కులను గురించి చెప్పారు. ఉదయంగారు 'టాన్యా' బుర్రకథచెప్పి ప్రేక్షకులను ఆశ్చర్యచకితులనుచేశారు.

కృష్ణాజిల్లాలో, కాటూరు గ్రామ మహిళాసంఘ సాధారణసభ 27-11-43 న జరిగింది. హిందూలా బిల్లునుగురించి, బెంగాలు కరువును గురించి పలువురు ఉపన్యసించారు. ఫాసిస్టువ్యతిరేక రాజకీయఖైదీలందరినీ విడువవలెననికోరుతూ తీర్మానించబడింది. మహిళల ఎ. ఆర్. పి. ప్రదర్శనంతో సభ జయప్రదంగా ముగిసింది.

బెజవాడ పట్టణ మహిళాసంఘ కార్యనిర్వాహకవర్గం డాక్టర్ అచ్చమాంబగారి అధ్యక్షతను 25-11-43 న సమావేశమై "బెజవాడ మునిసిపాలిటీ జనసంఖ్యలోను, విస్తీర్ణంలోను ఆదాయంలోను హెచ్చినా, పట్టణ పారిశుద్ధ్యానికి ఇదివరకటి పనివాళ్ళతోనే పని చేయించుచున్నారు. అందువల్ల నగర పారిశుద్ధ్యం సరిగా ఉండుటలేదు. వెంటనే పనివారలసంఖ్య హెచ్చించి, ప్రభుత్వ ఉత్తరువు ప్రకారం కరువుబత్తెం రు. 8-8-0 మునిసిపల్ పనివారలకు ఇచ్చి నగర పరిశుభ్రతకు తోడ్పడవలసినదిగా మునిసిపాలిటీని కోరుచున్నాము." అని తీర్మానించారు.

నవంబరు మూడవవారంలో పిఠాపురం తాలూకా(తూర్పుగోదావరిజిల్లా) గొల్లప్రోలు, కొత్తపల్లి గ్రామాలలో మహీధర సీతాదేవి, పుత్సల చల్లాయమ్మగారలు ప్రచారంచేశారు. మరుగుదొడ్లకు, మంత్రసాని, లైబ్రరీలకై ఆందోళన సాగుతోంది.

గొల్లపోలులో గ్రామమహిళాసభజరిగింది. ఫాసిస్టు వ్యతిరేక రాజకీయఖైదీలను విడువాలనీ, హిందూ లా సవరణబిల్లును అమలులోకి తీసుకురావాలనీ కోరుతూ తీర్మానించారు.

పశ్చిమ గోదావరి జిల్లా ద్వితీయ మహిళా మహాసభ

★

ఈ మహాసభ భీమవరం తాలూకా నవుడూరుగ్రామములో యీనెల 24, 25 తేదీలలో జరుగును. మహాసభాధ్యక్షురాలు: శ్రీమతి మానికొండ సూర్యావతి. ప్రారంభోపన్యాసకురాలు: డాక్టరు అచ్చమాంబగారు. మహిళలందరూ పాల్గొన ప్రార్థన.

—: కార్యక్రమం :—

24 వ తేదీ ప్రతినిధుల సమావేశం

25 వ తేదీ 1 గం.కు బహిరంగసభ.

పాటల సమిష్టిగాన పోటీలు, శిశు ప్రదర్శనం, ఎ. ఆర్. పి. ప్రదర్శనం, మహిళా సంఘంచే బుర్రకథ వుంటాయి.

ఇట్లు,
భూపతిరాజు వెంకాయమ్మ
ప్రెశిడెంటు
ప. గో. జిల్లా మహిళాసంఘం.

తీర్థాల్లో కరువునిధి వసూళ్లు

★

బెంగాల్ కరువునిధి వసూళ్ళకు ఒక గడువులేదు, బెంగాల్ కరువు సమస్య ఉన్నంతకాలం నిధి వసూలు చేస్తుండవలసినదే. ఈ దృష్టితోనే కొందోపాడు (భీమవరం తాలూకా) యువజనసంఘం, మహిళాసంఘం వారూ, కమ్యూనిస్టులు కృషి చేస్తున్నారు. ఈనెల 3 వ తేదీని అత్తిలి(తణుకు తాలూకా) లో పెద్ద తీర్థం జరిగింది. కొందోపాడు యువజనసంఘసభ్యులు స్థానిక కమ్యూనిస్టులతోను, భీమవరం తాలూకా మహిళా ఆర్గనైజర్లు గోకరాజు వెంకాయమ్మ, పరకాల అహల్యాగార్లతోను కలసి తీర్థానికి వచ్చిన వేలాది ప్రజలలో బెంగాల్ కరువును గురించి ప్రచారంచేశారు. కరువు చిత్రాలను చూపించారు. ఈవిధంగా ప్రచారం చేసి సాయంత్రానికి రూ 30-13-0 వసూలు చేశారు. స్థానిక కాంగ్రెసు ప్రముఖుడు శ్రీ చంద్రరావుగారు ఈ దళానికి విడిది, భోజనవసతులు ఇచ్చారు. వారు ఈ కృషిని అభినందించి, అంతా ఇలా పనిచేస్తే బెంగాల్ ప్రజల బాధలు తీరగలవని అన్నారు. స్నేహితుల చేత విరాళాలిప్పించారు. ఈ వసూలు మొత్తాన్ని బెంగాల్ పీపుల్సు రిలీఫ్ కమిటీకి పంపారు.

ఈతాలూకాలోనే శ్రీరామారావుపేటలో సుబ్రహ్మణ్యషష్టి తీర్థంలో యువజనసంఘం వారు 7.3-1 వసూలుచేశారు.

10వ ఆంధ్రరాష్ట్ర వైద్య మహాసభ

గతమాసం 27, 28 తేదీలలో 10 వ ఆంధ్రరాష్ట్ర వైద్యమహాసభ గుంటూరులో సమావేశమయింది, సమావేశానికి రాష్ట్రంలో వివిధప్రాంతాలనుండి 300 మంది డాక్టర్లు వచ్చారు. సమావేశానికి డాక్టరు పి. వీరయ్య చౌదరిగారు అధ్యక్షత వహించారు. డాక్టరు లక్ష్మణస్వామి మొదలియారుగారు మహాసభను ప్రారంభించారు.

ఆహ్వానసంఘం తరఫున డాక్టరు టి. చిదానందంగారు ఉపన్యసిస్తూ సోవియట్ రాజ్యంలోను, బ్రిటన్‌లోను, ఇతర స్వతంత్ర ప్రదేశాలలోను ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యాన్ని గురించి, వైద్య సౌకర్యాలనుగురించి ఎలా శ్రద్ధతీసుకుంటాయో వివరించారు. భారతదేశంలో ప్రభుత్వం ఇలా శ్రద్ధతీసుకోవడం లేదన్నారు. మనదేశంలో ప్రభుత్వంపారిశ్రామికాభివృద్ధిద్వారా ప్రజల ఆర్థికస్థితిని బాగుచేసి, జీవితాని కవసరమైన కనీసఆదాయం, తగినంత ఆహారం లభించేలా చేయాలన్నీ, ఉచిత వైద్యసౌకర్యాలేర్పాటు చేయాలనిఅన్నారు.

లక్ష్మణస్వామి మొదలియారుగారు తన ప్రారంభోపన్యాసంలో వైద్యులు తమ వృత్తియొక్క అభివృద్ధినేకాకుండా ప్రజలక్షేమాన్ని, ఆరోగ్యాభివృద్ధిని మనసులో పెట్టుకొని పని చేయాలన్నారు. యుద్ధానంతరం వైద్య సౌకర్యాలను గురించి కొన్ని సూచనలిచ్చారు.

డాక్టరు వీరయ్యచౌదరిగారు తన అధ్యక్షోపన్యాసంలో డాక్టర్లు తమలో తాము పోటీలు పెట్టుకోవడం సహించరాని దన్నారు. తమ శాస్త్రపరిజ్ఞానాన్ని అభివృద్ధిచేసుకొని ప్రజలకు తోడ్పడాలన్నారు. దేశీయ ఔషధ పరిశ్రమను ప్రభుత్వం నేడుప్రోత్సహించి యుద్ధానంతరం రక్షణ లివ్వాలన్నారు.

తీర్మానాల సారాంశం

తరువాత నేడు దేశాన్ని, ప్రత్యేకంగా డాక్టర్లను ఎదుర్కొంటున్న ముఖ్య సమస్యలు చర్చించబడి, అనేక తీర్మానాలు ఆమోదింపబడినవి. వీనిలో ముఖ్యమైన తీర్మానాల సారాంశం.

—నేడు దేశంలోని కరువును, జాడ్యాలను జయప్రదంగా ఎదుర్కోవాలంటే, రాజకీయ ప్రతిష్టంభన వెంటనే అంతమొంది జాతీయప్రభుత్వ మేర్పడడం అవసరం అని ఈసభవారు భావిస్తున్నారు.

—నేడు నిర్బంధంలోవున్న డాక్టర్లు జీవరాజమెహతా, మూల్పూరి రంగయ్య, ఎ. యస్. చలపతిరావు, తిరుమలరావు మొదలగు డాక్టర్లను వెంటనే విడుదలచేయాలని ఈసభవారు కోరుచున్నారు.

—నేడు బెంగాలు, అస్సాం, రాయలసీమ మొదలగుప్రదేశాలలోని విషమపరిస్థితిని ఈసభవారు గుర్తిస్తున్నారు. రాయలసీమకు క్షామనివారణసహాయాన్ని, బెంగాలుకు వైద్యసహాయాన్ని పంపడానికి ఈసభవారు తీర్మానిస్తున్నారు. బెంగాల్‌లోని వివిధ రిలీఫ్‌కమిటీలను ఒక కేంద్ర కమిటీగా ఐక్యము కావలసినదిగా ఈసభవారు కోరుచున్నారు.

—సామాన్య పౌరునికి అందుబాటులో వుండేటట్లు మందుల ధరలను కంట్రోల్‌చేసి మెడికల్‌అసోసియేషన్ సలహాతోగాని, ఇతర ప్రజాసంస్థల సలహాతోగాని, సక్రమంగా పంపకం జరిగేటట్లు చూడవలసినదని, ఔషధ వ్యాపారంలో దొంగమార్కెట్టును, సరుకును దాచడాన్ని అరికట్టవలసినదని, డ్రగ్‌ఆక్టును అమలుజరపవలసినదని ప్రభుత్వమువారిని ఈ సభవారు కోరుచున్నారు.

—అసలే తక్కువగాఉన్న ఔషధాలు సక్రమముగా పంపకం జరుగుటకై, రాష్ట్రమంతటా మెడికల్ కో-ఆపరేటివ్‌స్టోర్సును స్థాపించవలెనని ఈసభవారు తీర్మానించుచున్నారు.

— నేడు మన రాష్ట్రంలో చెలరేగుతున్న అనారోగ్య పరిస్థితులను, అంటువ్యాధులను ఎదుర్కొనుటకై చక్కని ఆరోగ్య శిక్షణగల మెడికల్ వలంటీరుదళాన్ని నిర్మించాలని, ఈదళము ప్రభుత్వ ఆరోగ్యశాఖతో సహకారంచేస్తూ పనిచేయాలని ఈ సభవారు తీర్మానించుచున్నారు.

— ఆర్మీ మెడికల్ సర్వీసులోకి ఎక్కువగా డాక్టర్లు చేరుటకై ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌చేసిన సూచనల నామోదించవలెనని ప్రభుత్వాన్ని ఈ సభవారు కోరుచున్నారు.

— కొన్ని పరిశ్రమలలో ఆరోగ్య భీమా విధానాన్ని ప్రవేశపెట్టుటకై ఒక చట్టాన్ని చేయాలని కేంద్రప్రభుత్వం చేసిన నిర్ణయం దేశ అవసరాలకు చాలదని తలుస్తూ, ఇతర దేశాలలో అమలునందున్న పద్ధతుల ననుసరించి వ్యావసాయిక, పారిశ్రామిక వర్కర్లందరకు వర్తించే సమగ్రమైన ప్లానును తయారుచేయాలని ప్రభుత్వాన్ని ఈ సభవారు కోరుచున్నారు.

— దేశంలో ఆహార కరువు విషమిస్తోంది. ప్రజల ఆరోగ్యం నానాటికి క్షీణిస్తోంది. ఇట్టి పరిస్థితులలో ఆహార పదార్థాల ధరలను ప్రజల కందుబాటులో వుండునట్లు తగ్గించడం, తగినంతగా ఆహారపదార్థాలను ప్రజల కందజేయడం, ఆహారం విషయంలో దేశాన్ని స్వయం పోషకంగా చేయుటకు ఒక ప్లానును తయారుచేయడం మొదలగు పనులకు ప్రభుత్వం పూనుకోవాలని ఈ సభవారు కోరుచున్నారు.

— ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా మద్యపాన నిషేధ చట్టాన్ని రద్దుచేసిన ప్రభుత్వ చర్యకు అసమ్మతి తెలుపుతూ, వెంటనే తమ నిర్ణయాన్ని మార్చుకోవలసినదిగా ప్రభుత్వాన్ని ఈ సభవారు కోరుచున్నారు.

— ఆరోగ్య సంబంధమైన, వైద్య సంబంధమైన, విషయాలన్నిటిలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌ను గుర్తించి సలహా తీసుకోవాలని ఈ సభవారు కోరుచున్నారు.

దేశాన్ని ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజాక్షేమాని కవసరమైన సూచనల నిచ్చింది కాన్ఫరెన్సు. అమూల్యమైన ఈ సూచనలు ప్రభుత్వం స్వీకరించాలి. ప్రస్తుత పరిస్థితులలో డాక్టర్ల కర్తవ్యాన్ని స్పష్టీకరించింది కాన్ఫరెన్సు. కాన్ఫరెన్సు సూచనల ననుసరించి, దేశంలో చెలరేగుతున్న అనారోగ్య పరిస్థితులనెదుర్కొని ప్రజల్ని రక్షించడానికి, ప్రజలలో ఆరోగ్య విజ్ఞానాన్ని వెదజల్లడానికి, ఔషధాలు ప్రజలకు సక్రమంగా అందజేయడానికి విరివిగా డాక్టర్లు ముందుకు వస్తారనే శుభసూచనలు కనపడుతున్నాయి.

పార్టీ ఫండుకై వరికోత

ఆహారపదార్థాలను అధికంగా ఉత్పత్తిచేసి రైతు, కార్మికులను కరువు బాధల నుంచి కాపాడడం, పరిశ్రమల్లో అధికోత్పత్తిని సాగించి ప్రజల అవసరాలను తీర్చి, దేశరక్షణను బలపరచడం నేడు కమ్యూనిస్టుపార్టీ కార్యక్రమంలో ముఖ్యాంశాలు.

పార్టీ రెండు లక్షలనిధి వసూలు సందర్భంలో కామ్రేడ్సు యీ రెండు నినాదాలను ప్రజల్లోకి విరివిగా తీసుకుపోతున్నారు.

పశ్చిమగోదావరిజిల్లా పోతునూరు గ్రామంలో ఈనెల మొదటితేదీని 7 గురు పార్టీ సభ్యులు, ఇద్దరు సానుభూతిపరులు పార్టీ ఫండుకు 1½ యకరాల్లో వరికోతకోశారు. వచ్చిన 9 రూపాయలనుపార్టీఫండుకిచ్చారు.

4 వ తేదీని దెందులూరు గ్రామంలో 9 మంది పార్టీసభ్యులు, సానుభూతిపరులు 1¾ యకరాల్లో వరికోతకోసి, 4-8-0 పార్టీ ఫండు కిచ్చారు. కృష్ణాజిల్లా, కైకలూరు తాలూకా వడాలి గ్రామంలో 35 మంది రైతులు కూలీలు 5 వ తేదీని పార్టీఫండుకు వరికోతలు కోశారు. ఈ సందర్భంలో అధికోత్పత్తియొక్క అవసరాన్ని తాముచేస్తున్న పనిద్వారానే కాకుండా, ఉపన్యాలు పాటలద్వారాకూడా ఆయా గ్రామాల్లో ప్రచారం జరిపారు. ఇలాగే తూ. గోదావరిజిల్లా మండపేటలో యువకులు వరికోత ద్వారా రు 8. పార్టీనిధికి యిచ్చారు.

★

నిపుణుల కేసాధ్యాలు నేర్పుతున్నారు కార్మికయోధులు!

నేటి పరిస్థితులకు తగినట్లు రైల్వే రంగంలో అధికకృషి జరగకుండా నిరంకుశ అధికారవర్గం లేనిపోని ఆటంకాలు కలిగిస్తోంది. దీనివల్ల దేశానికి కలుగుతున్న నష్టాన్ని యస్. ఐ. రైల్వే కార్మికులు గుర్తించి, తామే చొరవతీసుకొని ఈ ఆటంకాలనన్నిటిని తొలగించడం ప్రారంభించారు.

నిర్మాణయుక్తంగా సాగుతూన్న రైల్వే కార్మిక సంస్థలలో తిరుచునాపల్లిలోని గోల్డెన్ రాక్ వర్కుషాపు కార్మికులది అగ్రస్థానం. వర్కుషాపులో 5000 కార్మికుల్లో నూరింట 90 మంది కార్మికులు సంఘంలో ఉన్నారు.

ఈ వర్కుషాపులో ఇంతవరకు నెలకు 50 వాగన్లు రిపేరు అవుతుండేవి. ఈసంఖ్యను కార్మికులు నూటికిపెంచారు. ఈ అధికకృషి ప్రతినెలా జరగగలదని ఏజంటుగుర్తించాడు. రైలుపెట్టెల కప్పులకు కావలసిన కెంపురంగు ఇప్పుడు దొరకడంలేదు. ఇకనెలా? అనే సమస్యవచ్చింది. అధికారులకు, నిపుణులకు ఏమీతోచలేదు. కార్మికులు చొరవ తీసుకున్నారు. తారును ఉడకబెట్టి ఒక రంగును తయారుచేశారు. కప్పులకు రంగులేక రైలుపెట్టెలు ఊరకనే పడివుండవలసిన అగత్యం తప్పింది.

రంగును చిమ్మటానికి కావలసిన యంత్రభాగాలను ఇదివరకు ఇతరచోట్లనుంచి దిగుమతి చేస్తూండేవారు. ఇవిలేకపోతే ఆయంత్రం అంతా మూలపడవలసిందే - రంగుపూతల్లేక రైల్వేపెట్టెలు ఊరక ఉండవలసిందే. అలా జరుగుతే రవాణాకు ఎంతదెబ్బ! అందువల్ల ఈ యంత్ర భాగాలను వర్కుషాపులోనే తయారుచేయడానికికార్మికులుపూనుకున్నారు. అంతేకాదు, రైల్వేపెట్టెలకు కావలసిన మరమేకుల ఉత్పత్తినికూడా రెండింతలు చేశారు. పాత ఇనుముతో వీటిని చేసేపద్ధతి కనిపెట్టారు. పాతయినుముతోనే పెట్టెలకు కావలసిన స్ప్రింగులను కూడా రెండింతలుగ తయారుచేస్తున్నారు.

ఉక్కు కడ్డీల్లోంచి సన్నపాటి ఉక్కు తీగలను తీయడానికి ప్రయత్నించి, అది అసాధ్యమని పట్టభద్రులయిన నిపుణులు కళ్లు తేలవేశారు. ఆ పని నిప్పుడు కార్మికులు సాధించారు.

జూన్‌నెలలో యస్. ఐ. రైల్వేకార్మికుల మహాసభ జరిగింది. దేశరక్షణకోసం అధికోత్పత్తి సాగించాలనే సందేశం ఆ సమావేశం ఇచ్చింది. ఆనాటినుంచి కార్మికుల కృషి ఈ విధంగా ఫలిస్తూంది. సోవియట్ రాజ్యంలో లాగానే అక్కడి కార్మికులు బోల్షివిక్ పోటీతో అధికోత్పత్తి సాగిస్తున్నారు. మొట్టమొదట అధికారులు ఈ కృషిని అనుమానంతో కనిపెడుతుండేవారు. కాని కార్మికులకార్యదీక్ష వారిని లొంగదీసింది. ఇప్పుడు ఏ పనిని గురించయినా నిపుణులు కార్మికులతో కలిసి ఆలోచించడం మామూలు అవుతూంది.

★ ★ ★

హెచ్చు కరువుభత్యం సాధించారు

కర్నూలు పట్టణంలో మూడు మాసాల నుంచి మునిసిపల్ కార్మికుల సంఘం పనిచేస్తూంది. దీనిలో పాకీపనివారు 130 మంది సభ్యులున్నారు. వీరికి యుద్ధం ప్రారంభమయిన దగ్గర్నుంచి రూ 1-8-0 మాత్రం అలవెన్సు ఇస్తున్నారు. దీనిని హెచ్చు చేయాలని సంఘం ఆందోళన చేస్తూవచ్చింది. గతనెల 27 వ తేదీన 200 మంది సంతకాలతో కమిషనరుకు ఒక మహజరు పంపారు. ఈ ఆందోళన ఫలితంగా నవంబరు నెల నుండి రూ 4 లు అలవెన్సు ఇవ్వడానికి మునిసిపాలిటీ తీర్మానించింది. ఈవిజయాన్ని చూచి మిగతా పనివారందరూ సంఘంలోచేరి దానిని బలపరచడానికి ఉత్సాహపడుతున్నారు.

ఆదోని హెల్తాఫీసరు వింతచర్య

ఆదోని (బళ్లారి జిల్లా) లో మునిసిపల్ కార్మికుల సంఘం ఏర్పడి మునిసిపల్ కార్మికుల్లో నూతన చైతన్యం, కార్యదీక్ష పెంపొందిస్తూంది. వీరిలో ఏర్పడిన ఈ సంఘ చైతన్యాన్ని చూచి స్థానిక హెల్తాఫీసరు ఏమనుకున్నాడో, గతనెల 27వ తేదీని 13 ప్రశ్నలు రాసి, వాటికి సమాధానా లివ్వవలసిందని సంఘ కార్యాలయానికి ఒకజాబు పంపాడు. సంఘంయొక్క కార్యవర్గ సభ్యులందరి పేరులు, సంఘ సభ్యులుగా చేరిన వారందరి పేరులు తెలుపాలట. సంఘ సమావేశాలు ఎప్పుడు, ఎక్కడ జరుగుతాయో చెప్పాలట. సంఘం తాలూకు స్థలాలేమయినా ఉన్నాయేమో చెప్పాలట. సంఘం ఆశయాలేమిటి, ఇది చట్టసమ్మతమేనా — మొదలైన ప్రశ్నలు వేశాడు. ఇలా సంఘానికి సంబంధించిన వారందరి పేరులు, సమావేశాలకు సంబంధించిన స్థలాల వివరాలు అడగవలసిన పని హెల్తాఫీసరుకు ఏమిపట్టిందో? ఆ సంఘ కార్యదర్శి ఒక ఇంటిలో ఉంటూంటే, ఉన్నట్టుండి ఆ ఇంటివారు లేచిపొమ్మన్నారని తెలిసింది. కొంత వ్యవధి అడిగినా ఇవ్వలేదట. స్థానిక నిరంకుశాధికారులు ఎలాంటి అక్రమాలకయినా తలపెట్టవచ్చును. కార్మికులు నూటికి నూరుమంది సంఘంలోచేరి, పురజనుల సానుభూతిని చూరగొనుటద్వారా అధికారుల ఆటలను అరికట్టాలి.

★ నెల్లూరు జిల్లాలో

రైతాంగం ఆత్మవిశ్వాసంతో అనేకవిజయాలు సాధిస్తూంది

— ఖండవల్లి కృష్ణారావు

అక్టోబరు 16 వ తేదీ. ఆత్మకూరులో ఆరోజున భోరుమని భూమినీ, ఆకాశాన్నీ, కలుపుతూ కుంభవర్షం కురుస్తోంది. పంట చెరువంతా నిండిపోయింది. హోరుమని వీచే గాలివల్ల, కెరటాలుముమ్మరంగా వస్తున్నాయి. చెరువుకట్ట తెగితే, చేలల్లోకి నీరుప్రవహించి, పంటలన్నీ నాశనమౌతాయి. వెంటనే స్థానిక రైతుసంఘవర్కర్లు గ్రామస్థులందరినీ సమీకరించారు. చెరువుకట్టను దిట్టపరచడానికి పూనుకున్నారు. హిందువులు — ముస్లింలు, పిన్నలు—పెద్దలు, అంతావచ్చి తాటిమానులతోను, చొప్పకట్టలతోను, మట్టితోను, చెరువుకట్టను దిట్టపరిచారు.

వర్షంతగ్గలేదు. అంతకంతకు నీరుహెచ్చుతోంది. ఇక లాభంలేదనుకొని, చెరువుకు అనువైనచోట గండి కొట్టడానికి నిశ్చయించుకున్నారు.

కాని, యింతలో తాసిల్దారు వచ్చాడు. గండికొట్టవద్దన్నాడు. కొడితే, ఎరస్టుచేయిస్తానన్నాడు. రైతుల్ని బండబూతులు తిట్టాడు, బెదరించాడు. కాని, రైతులు శాంతంగా ఊరుకున్నారు. కొద్దిసేపట్లో అనుకున్నంతపనీ జరిగింది. చెరువుకట్టతెగింది. నీరు పొర్లిపోయి, చాలాభూములు మేటవేశాయి. సజ్జపైరు పూర్తిగానాశనమయింది. రైతులు చెరువులో నిల్చిన కొద్దిపాటి నీటిని కాపాడుకొని, తిరిగి వర్షాలు పడినప్పుడు చేలకు పెట్టుకోవచ్చుననే ఉద్దేశంతో, చెరువును భద్రపరచుకొనుటకు పూనుకున్నారు.

17 వ తేదీ మొదలు ప్రతిదినం 100మంది రైతులు, కూలీలు, తెగిన చెరువుకు తొట్టి (Ring bund) కట్టను 1200 అడుగుల పొడుగున వేయసాగారు. 8 రోజులలో కట్ట వేయుట పూర్తిఅయింది. చెరువుకు నీరురావడానికి, తెగిన బొగ్గేటి అనకట్టను మరమ్మతు చేయుటకు కూడా పూనుకున్నారు.

జిల్లా ఎగ్జిక్యూటివు ఇంజనీరు స్వయంగా వచ్చి, రైతులకృషిని అభినందించాడు. ఆనకట్ట మరమ్మతు విషయంలో ప్రభుత్వం రైతులకు తప్పక తోడ్పడుతుందని వాగ్దానంచేశాడు. నవంబరు 22 వ తేదీన జిల్లాకలెక్టరు తనిఖీ నిమిత్తం ఆత్మకూరు వచ్చినప్పుడు రైతుసంఘ నాయకత్వాన రాయబారంవెళ్ళి, రెండవ పంటకు అనుమతిని కోరగా, కలెక్టరు యిచ్చాడు. సజ్జకోసిన 600 యకరాలలో రెండవ పంటపండించుటకు రైతులు పైరు పెట్టారు. చెరువు కట్టను కొంతవరకైనా రిపేరుచేసి, కాపాడినందుకు ముజరా యివ్వడం న్యాయమని తెలియజెప్పారు. రెండింటికీ కలెక్టరు తన అంగీకారాన్ని తెలియచేశాడు.

కోఆపరేటివ్ స్టోరును నడిపేది రైతుసంఘ వర్కర్లే

ఈ విధంగా యేర్పడ్డ ప్రజా సమీకరణ అంతటితో ఆగలేదు. ఆత్మకూరు కోఆపరేటివ్ స్టోరుకు ప్రెసిడెంటైన తాసిల్దారు స్టోరును మూసివేసి, సరుకు తెప్పించడం మానివేశాడు. ఈ అధికార దుర్వినియోగాన్ని గ్రామస్థులు సహించలేకపోయారు. తాసిల్దారు వద్దకు రాయబారంవెళ్ళి, ప్రజలకు జరిగే అన్యాయాన్ని ఐక్యకంఠంతో ఖండించారు. తాసిల్దారు యిక చేసేదిలేక, తన అధ్యక్షపదవికి రాజీనామా యిచ్చాడు. ఇప్పుడు స్టోరును రైతుసంఘ వర్కర్లేనడుపుతున్నారు.

ఇలాగే, కోవూరుతాలూకా ఇందుపూరులో ఒక ధనికరైతు కో-ఆపరేటివ్‌స్టోరుపై పెత్తనం వహించి, సక్రమంగా దాన్ని నడపకపోవడంవల్ల మూసివేసే పరిస్థితు లేర్పడ్డాయి. వెంటనే గ్రామరైతుసంఘం ప్రజలలో ప్రచారంచేసి, స్టోరును నడపడానికి ముందుకొచ్చింది. ఇప్పుడు స్టోరు సక్రమపద్ధతిలో నడుపబడుతోంది.

గ్రామంలో వ్యవసాయకూలీలకు పనిపాటలులేక, తిండికి అగచాట్లు పడుతూంటే, రైతుసంఘ వర్కర్లు ఒక ఐక్య ఆహారకమిటీని ఏర్పరచి, ధాన్యపుఫండును వసూలు చేసి, వ్యవసాయ కూలీలకు వడ్డీ లేకుండా కొలుస్తున్నారు.

అడవిని సమిష్టి ఉపయోగానికి తెచ్చారు

కోవూరుతాలూకాలోనే తలమంచి అనే గ్రామం ఉంది. అక్కడ రైతుసంఘం చాలా రోజులనుంచి పనిచేస్తూంది. రైతులు తమ పశువుల్ని అడవికి తోలి మేపుకుంటారు. కాని, మొక్కలు వగైరా పెద్దవికాకముందే పశువులు ప్రవేశించడంవల్ల నష్టం సంభవిస్తుంది. కాబట్టి, నవంబరు 15 వ తేదీలోగా రైతులు పశువుల్ని అడవికి తోలవద్దని అడవి పంచాయితీ వారు ఉత్తరువు చేశారు. కొందరు రైతులు దీన్ని లెక్కచేయక, తోలసాగారు. అధికార్లు అట్టి పశువుల్ని దొడ్డికి తోలేవారు. రైతుసంఘవర్కర్లు బయల్దేరి, అడవియొక్క ఉపయోగాన్ని గురించీ, అడవి పాడైతే నష్టపడేది రైతులే అనీ, ప్రచారం చేశారు. తత్ఫలితంగా, యీ సంవత్సరం నవంబరు 15 వరకు ఎవరూ తమ పశువుల్ని అడవికి తోలలేదు.

కొంతకాలంక్రితం, ఎవరిబర్రెలనూ అడవికి తోలకూడదనే నిషేధం ఉండేది. ఈనిషేధాన్ని గ్రామాధికారులు బీదరైతుల బర్రెలకు మాత్రమే వర్తింపజేసేవారు. కాని, రైతుసంఘంచేసిన ప్రచారంవల్ల, అందరి బర్రెలూ అడవిలో మేయవచ్చునని యిటీవల నిర్ణయం తీసుకున్నారు.

తగాదాలను పరిష్కరించారు

ఈవిధంగా, గ్రామంలో ఐకమత్యం యొక్క ప్రభావాన్ని రైతులు గుర్తించి, తమ తగాదాలను రైతుసంఘంద్వారా పరిష్కరించుకొంటున్నారు.

ఇటీవల ఒక రైల్వే బంజరు విషయంలో స్టేషన్ మాస్టరుకూ — ఒక ధనికరైతుకూ మధ్య తగాదావచ్చింది. స్టేషన్ మాస్టరు రైతుసంఘం యెదుట ఫిర్యాదుచేశాడు. ఉభయులకు రైతుసంఘం రాజీకుదిర్చి, తగాదాను పరిష్కరించింది.

కోవూరు తాలూకాలోనే ఉప్పరపాలెం రైతులకీ—దామవరం రైతులకీ, మధ్య తగాదా వచ్చింది. ఒకరి గొర్రె మరొకరి చేలో మేస్తూండగా, చేనుగల రైతు ఆ గొర్రె చెవులు కోసివేశాడు. దానితో విరోధం ప్రారంభమయింది. ఇద్దరు గ్రామస్థులు ఒక శ్రోత్రియందారు ఏజంటువద్దకు వెళ్ళారు. అతను తగాదాను పరిష్కరించకుండా వాయిదాలువేస్తూ, ఉభయులమధ్య వచ్చిన చీలికను స్వార్థంకొరకు ఉపయోగించుకోవాలని చూచాడు. ఇంతలో రైతు సంఘంవారు జోక్యం పుచ్చుకొని, యిద్దరికీ అంగీకారమయేరీతిని పరిష్కరించారు. పై రెండు గ్రామాలలో రైతులు రైతు సంఘంలో చేరడానికి నిశ్చయించుకున్నారు.

ప్రజారక్షణదళంద్వారా పైర్లు కాపాడబడ్డాయి

నెల్లూరుతాలూకాలో తిరుమలమ్మపాలెం అనే గ్రామం ఉంది. గ్రామంలో కొందరు రైతులు తమ పశువుల్ని రాత్రిపూట కట్టకుండా విడిచిపెట్టేవారు. అందువల్ల పైర్లు చెడిపోయేవి. వెంటనే రైతులమధ్య ఘర్షణలు, పేచీలు, బయల్దేరేవి. రైతుసంఘవర్కర్లు పరిస్థితుల్ని చక్కబెట్టడానికి ప్రజారక్షణదళాన్ని ఏర్పాటుచేసి రాత్రిపూట గస్తీ తిరగ నారంభించారు. విచ్చలవిడిగా తిరిగే పశువుల్ని కట్టివేసేవారు. మరునాడు గ్రామస్థులమధ్య ప్రచారం చేసేవారు. ఈవిధంగా కొంతకాలానికి యీ అలవాటు పోయింది. తగాదాలు లేకుండా జీవితం కొనసాగుతూంది.

ఈమధ్య, యుద్ధబాండ్లకు డబ్బుయిమ్మని పెత్తనం చెలాయించే ఒక ధనికరైతుపై ప్రభుత్వాధికారులు ఒత్తిడితెచ్చారు. అతడు తనమీద పడ్డ బరువును పేదరైతుల మీదకి వేయజూచాడు. వెంటనే గ్రామ రైతుసంఘంలో వున్న కమ్యూనిస్టు పార్టీసభ్యులు గ్రామస్థుల ఆస్థి, అప్పు, ఆదాయం, ఖర్చు — వీటిని సూచించే లెక్కలు తయారుచేసి, శక్తిగలవారు సొమ్మును ఈయవలసిందని విజ్ఞప్తి చేశారు. ఈ విధంగా రు 60 వసూలైంది. ఈ సొమ్మును తీసుకెళ్ళి కలెక్టరువద్దకు రాయబారం వెళ్లారు. కలెక్టరు "ఇట్టి పేదప్రజల వద్ద సొమ్ము వసూలుచేయమని నేను చెప్పలేదే!" అని జవాబిచ్చాడు. ఈవిధంగా గ్రామ పెత్తందారు ఆట కట్టింది.

మైకా కార్మికులకు వైద్య సహాయం

మైకాగనులలో కార్మికులకేమైనా ప్రమాదాలు జరిగినప్పుడు, యజమానులు కొంతకాలం క్రితం వరకూ చికిత్సచేయించేవారు కాదు. కార్మికసంఘం స్థాపించబడినప్పటి నుంచీ పరిస్థితులు మారుతున్నాయి. దెబ్బలు తగిలిన పనివారికి యజమానులు శ్రద్ధతో చికిత్సచేయించుతున్నారు. ఇదివరలో నిర్లక్ష్యంగా ప్రవర్తించే ఆసుపత్రి డాక్టరు కార్మికుల విషయంలో శ్రద్ధవహిస్తున్నాడు. యూనియన్ ఎడతెగకుండా చేసిన ఆందోళనే యిందుకుకారణం. తమజీవితాలను రక్షించే విషయంలో కన్నతల్లివలె పనిచేస్తున్న యూనియన్‌ను కార్మికులు బలపరుచుకొంటున్నారు.

ఈవిధంగా, నెల్లూరుజిల్లాలో రైతుసంఘాలు కార్మికసంఘాలు ప్రజలరాజకీయ చైతన్యాన్ని అభివృద్ధిచేస్తూ, వారిహక్కులకై ఎడతెగకుండా పనిచేస్తున్నాయి. కమ్యూనిస్టులే ఈసంఘాలలో ఎక్కువగా ఉండి, నడుపుతున్నారు. ఇతరపార్టీలకు చెందిన దేశభక్తులు కూడా యీకృషికి తోడ్పడవలసిందని కోరుతున్నాను.

★ పుస్తకపరిచయం

ఫాసిజం; దాని విధ్వంసనం

రచయిత: విద్వాన్ విశ్వం. ★ ప్రచురణ: నవ్యసాహిత్యమాల, అనంతపురం.

94 పేజీలు; వెల 1 రూపాయి.

★

ఈ పుస్తకంలో విశ్వంగారు ఫాసిజం యొక్క లక్షణాలు, దాని స్వరూపం, సిద్ధాంతం, కార్యక్రమం, మొదలైన విషయాలను గురించి తేటతెల్లమైన తెలుగులో క్లుప్తంగా వివరించారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు నాయకులలో ఒకడైన రజనీ పామీదత్తు రచనలు యీ పుస్తకానికిఆధారం. పెద్దపెద్ద బ్యాంకర్ల సహాయంతో హిట్లరు ఏ విధంగా జర్మనీ నియంత అయాడో, అధికారంలోకి వచ్చాక కార్మిక సంస్థల్నీ, యితర ప్రజాస్వామ్య సంస్థల్నీ ఎలా అణచివేశాడో, జర్మన్ పౌరులలో చిన్నప్పటినుంచీ దురాక్రమణబీజాలు యెలా నాటాడో, సుప్రసిద్ధ శాస్త్రజ్ఞుల్నీ—విజ్ఞానవేత్తల్నీ యెలా ఇనుప కటకటాలలో బంధించివేశాడో, ఇందులో స్పష్టంగా వివరించబడింది. "జాత్యహంకారాన్ని చంటిపాలతో పిల్లలకు నూరిపోస్తున్నారు. ఈధోరణిలోనే పెద్ద సిద్ధాంత మొకటి బయలుదేరదీసినారు: (అదే) 'ఆర్యజాతి, ఆర్యరక్తం'! ఒకప్పుడు హిట్లరు యీ దృష్టితోనే భారత ప్రజలు అనార్యులు గనుక స్వయం పారిపాలనకు అనర్హులని వాగాడు."

జపాను ఫాసిజం మన దేశంలో ప్రవేశించకుండా అరికట్టవలసిన బాధ్యతను రచయిత యిలా వివరించాడు: "సామ్రాజ్యవాదులకు దేశం ఫాసిస్టుల పాలవడం, దొరికిపోవడం, కేవలం తమ ఆస్తిపోయినట్లు మాత్రమే. మనకో! సర్వ వినాశం. ఫాసిజం మహాఘోర దురహంకార సామ్రాజ్యవాదంగా తెలుసుకొని పోరాడవలసింది మనం." కాంగ్రెసు-ముస్లింలీగ్ ఐక్యతద్వారా జాతీయ ప్రభుత్వాన్ని సంపాదించుకొని, దేశరక్షణకు నడుంకట్టమని రచయిత జాతీయవాదుల్ని హెచ్చరిస్తున్నాడు.

ప్రతిదేశభక్తుడూ యీ పుస్తకాన్ని చదివి విషయాలు తెలుసుకోవలసిందనికోరుతున్నాం.

ప్రజాశక్తి చందావివరాలు

సంవత్సర చందా	5—0—0
అర్ధ సంవత్సర చందా	2—8—0
పావు సంవత్సర చందా	1—4—0

యుగోస్లావ్ స్వతంత్ర ప్రభుత్వం బలపడుతోంది

కైరోసమావేశానంతరం టెహరాన్ (ఇరాన్)లో స్టాలిన్-చర్చిల్-రూజ్‌వెల్టులు సమావేశ మయ్యారు.

ఈ రెండు సమావేశాలు ప్రపంచ చరిత్రలో కొత్త అధ్యాయాలను ప్రారంభించుతున్నాయి. సత్వర ఫాసిస్టు వినాశనానికి, నూతన స్వేచ్ఛాప్రపంచ నిర్మాణానికి, అవసరమైన తుది సన్నాహాలు ఈ సమావేశాలు గావించాయి. సోవియటు యూనియన్ ఆధిపత్యాన ప్రపంచ ప్రజాపక్షమే ఎలా విజయాలను సాధించుతుందో ఈరెండు సమావేశాల వల్లనే గ్రహించవచ్చు.

చైనాకు సమాన హోదా

కైరోలో మొట్టమొదటిసారి చైనాకు బ్రిటనమెరికాలతో సమాన హోదా ఈయబడింది. ఇదివరదాకా బ్రిటిషు-అమెరికన్ సామ్రాజ్యవాదుల క్రింద దాదాపు వలస దేశ (సెమీకాలనీ) స్థితిని అనుభవించింది. ఇపుడు మంచూరియా ఫార్మోజా, పెస్కాడోర్స్‌లను తిరిగి చైనా కప్పగించడం, కొరియాను జపాను నుండి విముక్తి గావించి స్వతంత్ర దేశంగా పరిగణించుతామని వాగ్దానం చేయడం—ఇదంతా బ్రిటన్ అమెరికాలతో చైనాకు సమాన హోదాను కల్పించారనడానికి నిదర్శనం.

రాజకీయంగా చైనాకు యిట్టి విజయం సంపాదించడం సంతోషింపదగిందే. కాని ఇంతటితోనే సరిపోదు. "జపానుపై నిరంతర యుద్ధం కొనసాగుతుందని", "జపానుపై దీర్ఘకాల యుద్ధ చర్యలు గావించుతూ వుంటామని", ఈసమావేశం చెప్పిందేగాని, జపానుపై సత్వరం తిరుగు దండయాత్రను గురించి చెప్పలేదు. కాలపరిమితినిగూడ నిర్ణయించలేదు. పైగా బర్మా, మలయా, డచ్ఇండీస్‌ల భవిష్యత్తుగురించి చెప్పలేదు. హాంకాంగ్ తిరిగి చైనా కిచ్చివేసే విషయంకూడా తేల్చలేదు. భారతదేశ ప్రతిష్టంభనను నిర్మూలించడాన్ని గురించికూడా లేదు. సత్వరం జపానుపై తిరుగుదాడిసల్పి జయించాలంటే ఈ పైనచెప్పిన పనులు వెంటనే గావించి, ఆయా దేశ ప్రజలను ఉత్సాహపరచాలి. అప్పుడే తక్కువ కష్టనష్టాలతో, త్వరలో విజయం లభించుతుంది.

ఫాసిస్టులకు అంతిమ ఘడియ

టెహరాన్ సమావేశంలోని నిర్ణయాలు, కైరో సమావేశంలోకంటె మరింత నిశ్చితంగాను స్పష్టంగానుఉన్నాయి. "తూర్పుపడమర దక్షిణదేశాలనుండి ఎప్పుడు ఎలాంటి దండయాత్రలు సల్పాలో" ఆవిషయమై సంపూర్ణమైన ఒడంబడికకు వచ్చినట్లు టెహరాన్ ప్రకటన తెలియజేస్తోంది. అంటే వానిఅర్థం రెండవరంగం ఫలానతేదీన ప్రారంభించాలని ఖచ్చితమైన నిర్ణయానికి వచ్చారన్నమాట. భూమ్యాకాశ సముద్రరంగాలలో నిరంతరం దెబ్బతీసి జర్మను సైన్యాలను నాశనం చేస్తామని తమ దృఢనిశ్చయాన్ని టెహరాన్ సమావేశంలో తెలియజేశారు. జర్మను సేనలను తాము నాశనంచేయకుండా ప్రపంచంలో ఎట్టి శక్తికూడా అడ్డుతగలలేదనికూడా చర్చిల్ రూజ్‌వెల్టు స్టాలిన్‌లు ప్రకటించారు.

ఈ ఒడంబడిక కోసమే ఎన్నాళ్ళనుండో సోవియట్‌ప్రజలూ, ప్రపంచప్రజలూ ఎదురు చూస్తున్నారు. ఈనాడు టెహరాన్‌లో చరిత్రాత్మకమైన ఒడంబడిక మూలంగా ఫాసిస్టు రాక్షసుల తుదిఘడియలు సమీపించాయి.

ఆసియాదేశాలకుకూడా అట్లాంటిచార్టర్

అన్నిటికన్న ఇరాన్‌విషయమై బ్రిటన్-అమెరికా-సోవియటు ప్రభుత్వాలు ప్రకటించిన ప్రకటన చాల ప్రాముఖ్యమైంది. సోవియటు యుద్ధరంగంలో నాజీలు ముందంజ వేస్తున్న రోజులవి. కాకసస్ ప్రాంతాలకు ప్రమాదం హెచ్చింది. అలాంటి సమయంలో ఇరాన్‌లో సోవియటు వ్యతిరేక కుట్రలను ప్రేరేపించసాగారు జర్మన్లు. అందుచే జర్మనుదుండగీడులనుండి కాకసస్‌ను రక్షించుకోడం, ఇరాన్‌కే భద్రతచేకూర్చడం, తద్వారా ఇండియాను రక్షించడం అవసరమయింది. అందుచే బ్రిటిషు—సోవియటు సైన్యాలు ఇరానును - ఇరాను స్వాతంత్ర్యానికి భంగం కల్గకుండా - ఆక్రమించుకున్నాయి. ఇరాన్‌లో ప్రవేశించిననాడే సోవియటు తన ఆక్రమణలోని ఉద్దేశ్యాన్ని స్పష్టపరచింది. అది ఈనాడు అక్షరాల నిజమయింది.

గత యుద్ధానంతరం ఇరాన్ దాదాపు బ్రిటిషువారి ఆర్థికపలుకుబడికి లొంగి యుండవలసివచ్చింది. అంటే సంపూర్ణస్వాతంత్ర్యం లేదనే చెప్పవచ్చును. కాని నేటి సమావేశంలో ఇరాన్ భవిష్యత్తును గురించి స్పష్టీకరించబడింది. "స్వతంత్రం, ఇతరదేశాలతోపాటు సమాన హోదా, తన ప్రదేశానికి తానే అధిపతి అయిఉండటం—ఇవి ఇరాన్ వాంఛలు. ఈ వాంఛలను బ్రిటన్-అమెరికా-సోవియటులు బలపరుస్తున్నాయి. శాంతిని అభిలషించే ఇతర దేశాలతోపాటు ఇరాన్‌కు కూడ, అట్లాంటిక్‌ఛార్టరు ననుసరించి అంతర్జాతీయ శాంతి, భద్రత, అభివృద్ధులను నెలకొల్పుటలో భాగం వుంటుంది."

ఇరాన్‌కుకూడ అట్లాంటిక్‌ఛార్టర్ వర్తింపజేయడం చాల ప్రాముఖ్యమైన విషయం. ఒక్క యూరపుకు మాత్రమే అట్లాంటిక్ ఛార్టర్ వర్తిస్తుందన్న చర్చిల్, ఆసియా ఖండంలోని ఇరాన్‌కుకూడ వర్తింపచేందుకు ఒప్పుకొన్నాడంటే ఎందువల్ల? స్టాలిన్ సమక్షంలో కరుడుగట్టిన సామ్రాజ్యవాదుల కలలు కల్లలయా యనడానికి ఇంతకంటె వేరే నిదర్శనం అక్కరలేదు. యుద్ధానంతరం శాంతి మహాసభలో సోవియటు ప్రముఖస్థానం తీసుకోక తప్పదు. ఆనాడుకూడ, నేడు ఇరాన్‌లోవలెనే, ప్రపంచ ప్రజావాంఛలే విజయం పొందుతాయని వేరే చెప్పనక్కరలేదు.

టర్కీ వైఖరి

చైనా, సోవియటు నాయకులతో సమావేశాలు ముగించినపిదప, చర్చిల్—రూజ్‌వెల్టులు టర్కిష్ రిపబ్లిక్ అధ్యక్షునితో సంభాషణలు సాగించారు. బ్రిటన్, అమెకా, సోవియటు ప్రభుత్వాల ఆహ్వానంపైన టర్కీ అధ్యక్షుడు కైరో వచ్చాడు. టర్కీని సంప్రదింపులకు ఆహ్వానించుటలో సోవియటు వుండటం, సంప్రదింపులలో సోవియటురాయబారి పాల్గొనడంచూస్తే, సోవియటు—టర్కిషు సంబంధాలు స్పష్టపరచబడినవని ఊహించవచ్చు.

టర్కిష్ రిపబ్లిక్ ఏర్పడగానే మొట్టమొదట దానిని గుర్తించిన ప్రభుత్వం సోవియటు అయినా, సోవియటు యెడల టర్కీ వైఖరి ఇదివరకు సంతృప్తికరంగా లేదు. అయినా జపాను జర్మనీలను సంతృప్తిపరచి, ఫాసిజాన్ని బలపర్చినశక్తులే, టర్కీలోగూడ సోవియట్ వ్యతిరేక భావాలను పెంపొందచేశాయి. ఇట్టి పరిస్థితులలో యుద్ధం వచ్చింది. ఆనాటినుండి టర్కీ తటస్థంగానే వుంది. ఇటు సోవియటుతోను అటు బ్రిటన్‌తోను వేర్వేరు ఒడంబడికలున్నా, జర్మనీతోగూడ ఒడంబడికలు లేకపోలేదు. మొత్తంమీద సోవియటు వ్యతిరేకంగాను, నాజీఅనుకూలంగాను టర్కీ ఉంటూవచ్చింది.

స్టాలిన్‌గ్రాడ్ విజయమూ, ఆఫ్రికాలో మిత్రసైన్యాల విజయమూ, టర్కీలో కొంతమార్పు తెచ్చింది. జర్మనీవైపు మొగ్గు తగ్గింది. జర్మనీతోటివ్యాపారంకూడా పూర్వంవలెలేదు. ఇప్పుడు బ్రిటనుకే ఎక్కువ ముడి పదార్థాలు సప్లయిచేస్తూ ఆయుధసామగ్రికొంటూవుంది. ఇంతకుపూర్వం చర్చిల్, అమెరికా ప్రభుత్వ ప్రతినిధి, టర్కీతో సంప్రదింపులు జరిపారు. ఇపుడు రూజ్‌వెల్టు చర్చిల్‌లు టర్కీ అధ్యక్షునితో సంప్రదించారు.

ఈసంప్రదింపుల ఫలితంగా వెంటనే మిత్రరాజ్యాలతో టర్కీ కలిసిందనడానికి సూచనలేమీలేవు. కాని అట్టిదే సంభవించితే, గ్రీసు, యుగోస్లోవియాల స్వాతంత్ర్య యుద్ధానికి మరింత సహాయపడడానికి వీలవుతుంది. బల్గేరియా, రుమేనియా హంగేరిలలో ఫాసిస్టు తొత్తులను కూలద్రోయడానికి రెడ్ ఆర్మీకి సహాయపడవచ్చు. అటు ఫాసిజం నుండి విముక్తిపొందిన బాల్కనురాజ్యాలు, ఇటు సోవియటుయూనియనూ టర్కీ-స్వాతంత్రాన్ని కాపాడటానికి మంచి సహాయభూతమౌతాయి.

యుగోస్లావియా స్వాతంత్ర యుద్ధం

యుగోస్లావియాలో తాత్కాలిక ప్రభుత్వమేర్పరిచిన గెరిల్లాలు ఒక కొత్త రాజ్యాంగ చట్టాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. మార్షల్ టిటో ఆధిపత్యాన పోరాడుతున్న "యుగోస్లావ్ స్వాతంత్ర సైన్యం" (యుగోస్లావ్ ఆర్మీ ఆఫ్ లిబరేషన్) అనేక విజయాలను సాధించుతోంది. దీనినిజూచి ఉత్సాహవంతులై అనేకమంది ఈ సైన్యంలో చేరుతున్నారు. ఉదాహరణకు ఆరువేల స్లోవక్ కార్మికులు హంగేరీ దేశంగుండా శత్రువులను హతమార్చుకుంటూ వచ్చి, యుగోస్లావ్ స్వతంత్ర సైన్యంలో చేరారు.

ఫాసిస్టులతో కలసి యుగోస్లావు దేశభక్తులను హత్య గావించుతున్న ద్రోహి మిహిలోవిచ్‌నే గొప్ప దేశభక్తుడని ఇన్నాళ్లూ కైరోలో తలదాచుకుంటున్న యుగోస్లావు రాజూ అతని అనుచరులూ, బ్రిటిషు అభివృద్ధి నిరోధకులూ చాటుతూ వచ్చారు. కాని ఈనాడు నిజం బట్టబయలయింది. మిహిలోవిచ్ "వాళ్ళంతా దోపిడిగాండ్రు గనుక వాళ్ళపై యుద్ధం చేశా" నని స్వీడిష్ పత్రికలో వ్రాశాడు. ఇలాగే కైరోలోని యుగోస్లావు 'ప్రభుత్వం' "వాళ్ళంతా దౌర్జన్యవాదుల ముఠా" అని త్రోసిపుచ్చింది. ఈ ప్రకటనలు బ్రిటిషు ప్రజలలో గొప్ప సంచలనం కల్గించాయి. కైరోలోని యుగోస్లావ్ ప్రభుత్వం ఈ మాటలను ఉపసంహరించుకోవాలని బ్రిటిషు ప్రజలంతా కోరుతున్నారు.

మార్షల్ టిటో ఇదివరకు స్పెయిన్‌లో ఇంటర్నేషనల్ బ్రిగేడ్‌లో పోరాడినయోధుడు. ఇపుడు ఏర్పడిన నేషనల్ లిబరేషన్‌కమిటీ (జాతీయస్వాతంత్రసమితి)లో సెర్బ్—స్లావ్-క్రోట్‌జాతుల వారందరూ వున్నారు. కమ్యూనిస్టులకు ప్రధానస్థానం ఉన్నా, మతాధిపతుల వద్దనుంచి అన్నిపక్షాలవారు దానిలో చేరారు. యుగోస్లావియానుండి తప్పించుకున్న ఒక అమెరికన్ పత్రికావిలేఖరి ఇలా వ్రాశాడు. "ఇంత క్రమశిక్షణగల్గి, తమ ఆదర్శంకోసం ఇంత గట్టిగా పోరాడే సైన్యాలను—ఒక్క కాకసస్‌లో తప్పితే—మరెక్కడా నేను చూడలేదు."

టైమ్సుపత్రిక రాజకీయ విలేఖరిసైతం మిహిలోవిచ్‌ని, మరికొందరు రాజకీయవేత్తలను అవసరమైతే వదులుకొని "టిటో" తో రాజీ చేసుకోవాలని చెబుతున్నాడు.

"న్యూస్టేట్సుమన్ అండ్ నేషన్" పత్రిక ఒకవ్యాసం ప్రకటించింది. దానిలో, "అనుభవంలేని రాజు యొక్క ప్రాపకంతో కొద్దిమంది ముసలి రాజకీయ వేత్తలు టిటో ప్రభుత్వాన్ని టెర్రరిస్టుల ప్రభుత్వం అంటున్నారు.

"కాని నిజానికి "టిటో" క్రింద 2 లక్షల సైన్యం వుంది. అంటే జనరల్ ఐసన్‌హోవర్ ఎంతమంది శత్రువులకు పని కల్పించుతున్నాడో "టిటో"కూడ అంతమంది కిపని కల్పించుతున్నాడు. "టిటో"ప్రభుత్వం ప్రజాప్రభుత్వం. అందుచే మిత్రరాజ్యాలు శేషరతుగా దానిని సపోర్టుచేయాలి. కైరోలో రాజు గనుక ఇంకా ఆ తప్పుడు సలహాదార్ల ముఠాకే అంటిపెట్టుకొంటే, యుగోస్లావు గెరిల్లాలు రాజరిక ప్రభుత్వాన్నే పూర్తిగా త్రోసిపుచ్చుతాయి. ఆనాడు రాజును బ్రిటను అమెరికాలు ఏవిధంగాను సపోర్టు చేయలేవు. చేస్తే, తాము చెప్పే ప్రజాస్వామ్య ధర్మసూత్రాలన్నీ శ్రీరంగనీతులవుతాయి."

ఇలా ప్రజాస్వామ్య శక్తులన్నీ మార్షల్ టిటోను సపోర్టు చేస్తున్నాయి. సోవియట్ ప్రభుత్వంకూడ టిటో ప్రభుత్వాన్నే గుర్తించుతున్నట్లు తెలియవచ్చింది. సోవియట్‌వలెనే ప్రజల ఆందోళనమూలంగా బ్రిటన్ అమెరికాలు కూడా యుగోస్లావు స్వాతంత్ర సైనిక ప్రభుత్వాన్ని గుర్తించకతప్పదు.

— తుమ్మల వెంకటరామయ్య,
13—12—43

((2 వ పేజీ తరువాయి) సహాయం చేశారు. ఫాసిజంనుండి తమ దేశాలను రక్షించుకోవడం ద్వారా, మిత్రరాజ్యాల యుద్ధకృషికి తోడ్పడడంద్వారా, తమకు స్వాతంత్రం లభిస్తుందని పూర్తిగా విశ్వసించి పనిచేశారు. కనుకనే వీరి కృషిని మిత్రరాజ్యాలు గుర్తించవలసివచ్చింది.

స్వాతంత్ర్యానికి మార్గం

మనదేశం విషయమైకూడాయింతే. మనకు, బ్రిటిష్ - అమెరికన్ ప్రజలకు, చైనా - రష్యా ప్రజలకు - ప్రపంచ ప్రజలందరికీ - సమానశత్రువైన ఫాసిజాన్ని యెదుర్కోవడం ద్వారానే, మనదేశాన్ని మనం రక్షించుకోవడం ద్వారానే, మన స్వాతంత్ర్య పోరాటం ఫలిస్తుంది. యుద్ధాన్ని వ్యతిరేకించడంగాని, తటస్థంగా ఉండడంగాని, మనకు యేవిధంగాను సహాయపడదు.

బ్రిటిష్ ప్రజలు మనస్వాతంత్ర్యం కొరకు ఆందోళన చేస్తున్నారు. మనమో? నిస్పృహతో, నిరాశతో, చేతులు ముడుచుకొని కూచున్నాం. బ్రిటిష్ ప్రజలు అమెరీని సభలలో మాట్లాడనీయకుండా చేస్తున్నారు. మనమో? చొరవను పూర్తిగా నిరంకుశాధికారుల చేతుల్లో విడిచిపెట్టాం. ఫలితం? సామ్రాజ్యవాదుల ఆటలే యింకా కొనసాగుతున్నాయి.

ఈ పాడు ప్రతిష్టంభనను యిప్పటికైనా మనం అంతంజేసి, స్వాతంత్ర్యంవైపుకు అడుగు వేయవద్దా? దేశరక్షణకు అత్యవసరమైన జాతీయప్రభుత్వ స్థాపనకు ప్రయత్నించవద్దా? కాంగ్రెసు—ముస్లింలీగులమధ్య ఒడంబడికకు పునాదియైన జాతుల స్వయం నిర్ణయ సూత్రాన్ని అంగీకరించవద్దా? కాంగ్రెసు—ముస్లింలీగు కలిసి పనిచేయడం అసాధ్యంకాదు. ఐక్యత! ఐక్యత!! ఐక్యత ఒక్కటే ఏ నిరంకుశ ప్రభుత్వాన్నైనా లొంగతీయగల ఆయుధం. అట్టి ఐక్యతకొరకు మన దేశభక్తులు యికనైనా నడుం బిగించాలి.

★

ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలి!

మద్యపాన నిషేధచట్టాన్ని నిర్మూలిస్తూ మద్రాసు ప్రభుత్వం గావించిన ప్రకటనను అనేక ప్రజాసంస్థలు, రాజకీయ పార్టీలు, సమావేశాలు ఖండిస్తున్నాయి.

ఈ క్రిందిసంస్థలు ప్రభుత్వచర్యను నిరసిస్తూ తీర్మానించాయి: తూర్పు గోదావరిజిల్లా కమ్యూనిస్టుపార్టీకమిటీ; నర్సాపురం తాలూకా కమ్యూనిస్టుకమిటీ; తిరువూరుతాలూకా రైతు సంఘం; ఆత్మకూరు (అనంతపూర్ జిల్లా) గ్రామ బాలసంఘం; బందరు మ్యునిసిపల్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థుల యూనియన్; విజయనగరం విద్యార్థిసంఘ యాజమాన్యాన బహిరంగసభ; కాకినాడ పట్టణ పీచు కూలీసంఘం; కాకినాడ మ్యునిసిపల్‌వర్కర్సు యూనియన్; కాకినాడ చుట్టల పనివారల సంఘం; మోరిగ్రామ యువజనసంఘం.

అధికాహారోత్పత్తికి రైతులు సాగివస్తే, అడ్డగలవారెవరు ?

హైదరాబాద్ స్టేట్‌లో గద్వాల సంస్థానానికి చెందిన 130 గ్రామాలలో తరతరాల నుండి రైతులవద్ద చెన్నకేశవస్వామి దేవాలయమునకై "విరాళము" అనేపేరుతో సంస్థానోద్యోగులు 80 వేల రూపాయలు అక్రమంగా వసూలుచేసేవారు. (ఎక్సైజు వసూళ్ళమీద, రివెన్యూ వసూళ్ళమీద, రూపాయకు 0-1-0 చొప్పున.) ఇంతేగాక, ఘర్‌పట్టీ (ఇంటిపన్ను), సంస్థానాధీశుల ఏనుగులకు చొప్ప, ధాన్యం, వగైరా అక్రమపు పన్నులు, వసూలుచేసేవారు. పై 80 వేల రూపాయలలో 25 వేలు మాత్రమే దేవాలయంలో ఉత్సవ సందర్భంలో వినియోగించేవారు. మిగతా "విరాళం", అక్రమపన్నులు, సంస్థానాధీశుల స్వంత ఖర్చుకు వినియోగించబడేవి.

ఈ అన్యాయాన్ని గురించి ఆంధ్ర మహాసభవారు సాకల్యంగా విచారణ జరిపి, తమ రిపోర్టును ప్రకటించారు. అక్రమ వసూళ్లను నిలిపివేయవలసిందని, అధికాహారోత్పత్తికి అవి ఆటంకం అనీ, ఆందోళన ప్రారంభించారు. సంస్థానంవారు కొంతవరకు లొంగక తప్పిందికాదు. "విరాళం" తప్ప మిగతా అక్రమపు పన్నులన్నీ ఆపుచేయుట కంగీకరించారు. "విరాళం" కూడా అక్రమమే కాబట్టి, దాన్ని కూడా వసూలుచేయరాదని ఆంధ్ర మహాసభవారు నైజాం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి, ప్రజలలో ప్రచారం కొనసాగించారు. తత్ఫలితంగా, కొద్దిరోజుల క్రితమే 80 వేల రూపాయల "విరాళం" అక్రమపు వసూలని నైజాం ప్రభుత్వం తీర్పు యిచ్చింది.

పొగాకు కంట్రాక్టుదార్లకు సమ్మెట దెబ్బ

తిరువూరు తాలూకా, విస్సన్నపేట గ్రామంలో బుద్ధవరపు చెరువు, పెద్దచెరువు, అనే రెండు పంటచెరువులున్నాయి. జమీందారు 2 నెలల క్రితం వాటిని వర్జీనియా పొగాకు సాగుకు కంట్రాక్టు యిచ్చి ఉన్నాడు. రైతు తాము పండించే, ఆహారపంటలకు యిది ఎంతనష్టమో వివరిస్తూ అనేకసార్లు జమీందారు యెదుట మొరపెట్టుకున్నారు. కాని, అతడు పెడచెవినిపెట్టాడు. 14-11-43 తేదీని జమీందారీ ఉద్యోగులు వచ్చి, చెరువు నీటిని వెళ్ళగొట్టుటకు ప్రయత్నిస్తూంటే, రైతులంతా సమావేశమై, నీటిపై హక్కు తమదేననీ, ప్రజల్ని కరువురాక్షసినుండి కాపాడుటకు, ఆహారపదార్థాలపంటను ప్రోత్సహించడంపోయి, ఈవిధంగా ఆటంకపర్చడం అన్యాయమనీ, విజ్ఞప్తిచేశారు. దీనితో జమీందారీ ఉద్యోగులు తమ ప్రయత్నాన్ని మానివేశారు. కాని మళ్ళీ 24-11-43 న జమీందారు ఉత్తరువులపై ఠాణేదారు, ఎస్టేటు నౌకర్లు, కంట్రాక్టర్లు, వచ్చి తూములు తీయడానికి ఉద్యుక్తులయారు. అక్కడికి సమీపంలోనే ఉన్న ఒకరైతు, యిద్దరు యువకులు ఇదిచూచి, రైతులకు నీటిపైగల హక్కును పురస్కరించుకొని నీటిని వెళ్ళగొట్టనీయం అని ఖండితంగా చెప్పారు. ఐనా, వచ్చిన పరివారం ఈమాటలను లెక్కజేయక నీటిని విడిచిపెడుతూంటే, రైతులు తూములను బిగించివేశారు! కాని మరునాడు ఉదయమే జమీందారీ మనుష్యులు వచ్చి, తూములుతీసివేసి వెళ్ళిపోయారు. తక్షణమే రైతులు, రైతువర్కర్లు ఎస్టేటు ఠాణాకువెళ్ళి ఆహారోత్పత్తికి అతడెలా అడ్డుతగులుతున్నాడో బోధించిచెప్పారు. రైతుల ఉత్సాహాన్ని మంటగలిపితే, జమీందారుకు - రైతులకు మధ్య అనేక కలతలు రావచ్చునని హెచ్చరించారు. తన ఉత్తరువును రద్దుచేసుకోవలసిందని ప్రార్థించారు. జమీందారు ఏమనగలడు? వెంటనే ఎస్టేటు నౌకర్లచే తూములు మళ్ళీ బిగించేటట్లుచేశాడు!

ఓవర్‌సీరు ఆట కట్టింది!

దివి తాలూకా, నిడుమోలు గ్రామంలో పి. డబ్లియు. డి. ఓవర్సీరు రైతులవద్దకు వచ్చి, గ్రామంలోని రైతులు రు. 600 ల యుద్ధబాండ్లను కొనవలసిందని చెప్పాడు. రైతులు రు. 100 బాండ్లు మాత్రమే కొనగలమని జవాబిచ్చారు. దానిమీద ఓవర్సీరు, రు 600 బాండ్లు కొనకపోతే తూములు పీకివేయిస్తానని బెదరించాడు. కొన్నాళ్ళు గడిచాక, ఆ ఓవర్సీరు, సబ్‌డివిజనల్ ఆఫీసరు, నిడుమోలు వచ్చినప్పుడు గ్రామ రైతుసంఘంలో పనిచేసే కమ్యూనిస్టులు, కొందరు రైతులు, వెళ్ళి రు. 100 కంటె హెచ్చు యివ్వలేమని ఎస్. డి. ఓ. తో చెప్పారు. కొంతసేపు చర్చించినమీదట, ఆయన అంగీకరించాడు. రైతులు సొమ్ము పోగుచేస్తూంటే, ఒకరోజున ఓవర్సీరు మళ్ళీవచ్చి, ఏమి చేస్తున్నారని ఒక రైతును అడిగాడు. అతడు ఎస్. డి. ఓ. ఆర్డరు ప్రకారం సొమ్ము వసూలు చేస్తున్నాం అని జవాబిచ్చాడు. ఓవర్‌సీరు మండిపడి ఎస్. డి. ఓ. నిర్ణయాన్ని లెక్కచేయకుండా పొలాలకు నీరువచ్చే తూమును బిగించి వేయించాడు. 40 యకరాలలో పంట పాడయే పరిస్థితి యేర్పడింది. ఈ కరువు రోజుల్లో 40 యకరాల పంట నష్టం కావడమంటే యేమో నిడుమోలు రైతులు గుర్తించారు. వెంటనే గ్రామ రైతుసంఘం తరపున ఎస్. డి. ఓ. వద్దకు డెప్యూటేషన్ వెళ్ళి, పరిస్థితులను గురించి తెలియజెప్పారు. ఎస్. డి. ఓ. అంగీకరించి, తూమును తెరిపించుటకు ఉత్తరువు చేశాడు. రైతులు రు. 100 యుద్ధబాండ్లకు సొమ్ము వసూలు చేస్తున్నారు.

లోచర్ల చెరువుకు నీటిసప్లయి

పెనుగొండ తాలూకా (అనంతపురంజిల్లా) లోచర్లగ్రామ చెరువు పి. డబ్లియు. డి. వారిది. దానికింద 350 యకరాల తరుభూములు ఉన్నాయి. ఐతే, వాటికి నీటిసప్లయి షుమారు 10 మైళ్ళ దూరంలో ఉన్న చిత్రావతి నుండి రావలసియుంది. మధ్యలో బీడుపల్లి వాండ్ల చెరువుకు, లోచర్ల చెరువుకు, నీరురావలసియుండుటచే, ఉభయగ్రామాలకు మధ్యతగాదాలు వచ్చేవి. లోచర్ల గ్రామానికి ఆప్రదేశం 5 మైళ్ళనూ, బీడుపల్లికి అరమైలునూ, ఉండడం వల్ల బీడుపల్లి రైతులు లోచర్ల చెరువుకు పోవలసిన కణుజుపై అడ్డుకట్ట వేయడం పరిపాటి. ఇట్టి కలతలను స్థానిక రైతుసంఘ వర్కర్లు పరిష్కరించుటకు పూనుకున్నారు.

లోచర్ల చెరువుకు 1 మైలు దూరంలో వంకపేరు అనే వంకనుండి కట్టుకాలవ ఒకటి ఉంది. కాని, చాలకాలంనుండి అది పూడిపోయింది. తవ్వించడానికి ప్రభుత్వం శ్రద్ధ తీసుకోలేదు. ఆకట్టుకాలవ రిపేరు ఐతే, లోచర్ల గ్రామస్థుల భూములన్నింటికీ నీరు సప్లయి కావడమేకాక, దిగువనున్న మరొక గ్రామంలో 40, 50 యకరాల భూమికి నీరు వస్తుంది. రైతులు వెంటనే కార్యరంగంలో దూకారు. ఏటి కాలువను రిపేరుచేయడానికి నిశ్చయించుకున్నారు. ఎకరానికి 10 గుంట్లు చొప్పున, ఎన్ని ఎకరాలుంటే అన్ని గుంట్లు తవ్వడానికి ప్రతిరైతు అంగీకరించాడు. పెద్ద రైతులు చిన్న రైతులకు పూర్తిగా తోడ్పడి పనిచేస్తున్నారు. గ్రామంలో రైతు సంఘం ఏర్పడి, సలహాలిస్తోంది.

మైనర్ ప్రాజెక్టుల నిర్మాణానికి ఎన్నో అవకాశాలున్నాయి

— వావిలాల గోపాలకృష్ణయ్య

గుంటూరుజిల్లా ఆహారపదార్థాల ఉత్పత్తిలో తరుగుజిల్లా. అందును సత్తెనపల్లి, గుంటూరు, ఒంగోలు, వినుకొండ, నర్సారావుపేట, పల్నాడు, తాలూకాలు పూర్తిగా తరుగు తాలూకాలు. ఈ తాలూకాలలోని పైరులు పూర్తిగా వర్షాధారంవల్లనే అభివృద్ధి పొందవలసియున్నవి. పల్నాడు, సత్తెనపల్లి, గుంటూరు, తాలూకాలకు సరిహద్దులుగా కృష్ణాతరంగిణి ప్రవహించుచున్నను, దాని నీటి నుపయోగించుకొని సస్యశ్యామలమగు భాగ్యమునకు ఈ తాలూకాలు నోచుకొనలేదు.

వాగులు, వంతలు, బుగ్గలు, చెరువులు

ఈ తాలూకాలలో అక్కడక్కడ అనేక వాగులు, వంతలు, చిన్నచిన్న నదులు, బుగ్గలు, ఉన్నవి. ఉండినను, అవి పూర్తిగా ఉపయోగించుకొన బడుటలేదు. వినుకొండ తాలూకాలో దొండపాడు, పల్నాడు తాలూకాలో ఆత్మకూరు, సత్తెనపల్లి తాలూకాలో క్రోసూరు, ఒంగోలు తాలూకాలో భవనాశి, చెరువులు మేజరు ఇర్రిగేషను చెరువులు. ఈ చెరువులక్రింద సగటున 400 ఎకరం చొప్పున సాగు అగుచున్నది. ఇవిగాక, మిగతావి మైనరు చెరువులు.

తాలూకా	గ్రామాలు	చెరువులు	ఎకరాలు
గుంటూరు	29	52	2695
నర్సరావుపేట	40	52	3394
ఒంగోలు	24	33	2219
పల్నాడు	46	70	3781
సత్తెనపల్లి	26	29	1540
వినుకొండ	31	48	2208
మొత్తం	194	284	15737

ఈ జలాధారాలలో నాగులేరు, బుగ్గవాగు మినహా అన్నీ చెరువులే! ఈ చెరువులు పూర్తిగా మెరకవేసి, స్లిట్‌పేరి, వర్షాలు ఆలస్యంగా కురియడంవల్ల పంటలకు అంత ఉపయోగం లేకుండాపోతున్నది. ఈ చెరువులక్రింద అదనుకు నీరులేక, వచ్చిన వెంటనే పంటలువేసి, నీరుచాలక చివరకు వేసిన పైరు అంతా యెండి నష్టపడడం తటస్థించుచున్నది. అందుకే చెరువులక్రింద 6 నెలల వరివేసిన పిదప 3 నెలల వరిరకాలు వేయవలసినదిగా ప్రచారం చేయవలసి వస్తున్నది. సాధారణంగా నీరు లభించడమే చాల కష్టంగా వుంటున్నది. ఈ చెరువులకు వాగులనుండి నీరు లాగినా కొంత ఉపయోగపడేది అది జరగడంలేదు. పైగా చెరువులు మెరకలువేసిపోవుచున్నందున వరదలనీరు కూడా చెరువులకు యెక్కువ నిలువక, అలుగులగుండా వెంటనే పోవుచున్నది.

కరువులు, రోగాలు

ఈ సంవత్సరం దేశాన్నంతా ఆవరించిన ధాన్యపుకొరతకు తోడు పై తాలూకాలలో, ముఖ్యంగా పల్నాడు వినుకొండ తాలూకాలలో, పూర్తిగాను, నర్సారావుపేట, ఒంగోలు, సత్తెనపల్లి తాలూకాలలో చాలభాగమున్నూ క్షామదేవతకు బలి అయినవి. ధాన్యం లేక గ్రామాల ప్రజలుకూడా బస్తీలకు పరుగులెత్తారు. సజ్జలు, జొన్నలు, ధాన్యంపండించే రైతుకే ధాన్యంకొనుక్కోవలసినగతి పట్టింది. కొనుక్కుందామన్నా, ధరలు ఎక్కువగా ఉండడంవల్ల కొనలేక ఏదో ఒకవిధంగా పొట్ట నింపుకోవలసి వచ్చింది. అందువల్ల ఆరోగ్యాలు కోల్పోవడం, కలరా - బంకవిరేచనాలకు గురికావడం, జరిగింది.

ప్రభుత్వం కదలుటలేదు

దీనికి తగు పరిష్కారమార్గం ప్రభుత్వం, ప్రజలు తీవ్రంగా ఆలోచింలి. క్రోసూరువద్దనున్న ఇసుకవాగుకు డాముకట్టితే, (రైతులు స్వంతఖర్చులతో కట్టించుకుంటా మన్నారు) 300 ఎకరాలు సాగుఅయ్యే అవకాశం ఉంది అని 1939 లో పి. డబ్ల్యు. డి. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు అంగీకరించినా యింతవరకు ఆర్డరు రాదు. భృంగుబండ ప్రాజక్టు రు 1,20,000 లతో ప్రారంభిస్తే, 1600 ఎకరాలు సాగు అవుతుంది అని 1906 నాటి కాగితం 1938 లో బయటికి తీశారు. కాని మళ్ళీ దానిసంగతే ఆలోచనలేదు. కండ్లేరు ప్రాజెక్టు ఒక లక్ష రూపాయలతో కడితే 1100 ఎకరాలు సాగు అవుతుందని 1937 లో ఇంజనీర్లు అంగీకరించినా, వినుకొండ తాలూకా ప్రజలంతా నిరంతరం ఆందోళనచేస్తూన్నా, ఇంతవరకు తేలలేదు. ఒంగోలు తాలూకాలో భవనాశి చెరువును అభివృద్ధి పరిస్తే ఇంకా 700 ఎకరాలు సాగుఅయ్యే అవకాశం ఉందని అంచనాలువేశారు. గాని మళ్ళీ కదిలించరు. గుండ్లకమ్మ ప్రాజెక్టు దాదాపు 2 లక్షల రూపాయలతో కట్టిస్తే సుమారు 2000 ఎకరాలు సాగు అవుతుందనే సంగతి పి.డబ్ల్యు.డి. అధికారులంతా అంగీకరిస్తారు. కాని పని ప్రారంభించరు. పిల్లేరు ప్రాజెక్టుసంగతి మాజీ రివెన్యూమంత్రి ప్రకాశంగారు ఆలోచించారు. తర్వాత ఏమయిందో తెలియదు. అక్కడ రు. 20,000 లతో 300 ఎకరాలు సాగుఅవుతుంది. దైదతేలుకట్ల ప్రాజెక్టు ఎప్పుడు వస్తుందా! ఎప్పుడు కష్టాలు గట్టెక్కుతవా! అని పల్నాడు ప్రజలు 30 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారు. దీనికింద 2 లక్షల యెకరాలు సాగు అవుతుంది. బెల్లంకొండవారిపాలెం–కొప్పునూరుల వారవలమధ్య ఒక ఫర్లాంగు మేర కట్టకడితే కృష్ణనీటిని పారించవచ్చు. మొత్తం ఖర్చు రు. 20 వేలకంటె ఎక్కువ కాదు. 20 వేల యకరాలు సాగుఅయే అవకాశం ఉంది. ఎద్దువాగు ప్రాజెక్టు, ఓగేరు ప్రాజెక్టు, రొంపేరు ప్రాజెక్టు, మొదలైనవి– చిన్నవి, పెద్దవి– ఎన్నో ఉన్నవి.

మేళ్ళవాగుప్రాజెక్టు (నాగులేరుకు) కట్టితే ఒక వెయ్యి ఎకరాలు సాగుఅవడానికి అవకాశం ఉంది అని ఎన్నాళ్ళనుంచో ఆలోచన చేస్తున్నారు. ఇంతవరకు కదలికలేదు. మళ్లీ కండేరు, మేళ్ళవాగుల విషయం ఆలోచనలో పడ్డదనివిన్నాము. అది ఎపుడుజరుగుతుందో?

మద్రాసుప్రభుత్వం యిప్పుడైనా మేల్కొని తిరిగి కరువు సంభవించేలోగా మైనరు ప్రాజక్టులను నిర్మించి, అధికాహారోత్పత్తికి తోడ్పడవలసిందని కోరుతున్నాను.

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE